
ఆంధ్రజ్యోతి
****
ANDHRAJYOTHY
నల్లగొండ
1
ఆదివారం 4 మే 2025



హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	:18004251442
యాదాద్రి	:1800 425 7106
సూర్యాపేట	:1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 60

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.170	260	290
సూర్యాపేట	రూ.160	240	270
నల్లగొండ	రూ.162	235	267

ఉష్ణోగ్రత గరిష్ఠం 40.5 । కనిష్ఠం 24.4



ఆటాపాటల

సమయం.. వేసవి

చిన్నారులకు శిక్షణ... భవితకు రక్షణ!!

పుస్తకాలతో కుస్తీ పట్టిన చిన్నారులకు వేసవి సెలవులంటే మహా సరదా. అధిక సమయం ఆటల్లో మునిగితేలుతుంటారు. ప్రస్తుతం సెల్ ఫోన్ ప్రపంచంగా మారడంతో పిల్లలు సైతం వాటికి బానిస అవుతున్నారు. శారీరక ఆటలు మరిచి సెల్‌ఫోన్ గేమ్స్‌కు బానిసవుతున్నారు. బాల్యానికి సెల్‌ఫోన్ ప్రమాదకారిగా మారుతున్న నేపథ్యంలో వేసవి సెలవుల్లో పిల్లల దృష్టిమరల్చాలని నిపుణులు చెబుతున్నారు. అందుకు వేసవి శిక్షణ శిబిరాలు దోహదపడనున్నాయి. జిల్లాలో ఇప్పటికే వేసవి శిబిరాలు ప్రారంభమయ్యాయి. నాట్యం, డ్రాయింగ్, ఆటలకు సంబంధించిన శిబిరాలు కొనసాగుతున్నాయి. పిల్లల అభిరుచి మేరకు వీటిలో శిక్షణ ఇప్పించాలని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

• 2లో.. - (ఆంధ్రజ్యోతి-యాదగిరిగుట్ట రూరల్)

సుస్థిర వ్యవసాయానికి రాష్ట్ర ప్రభుత్వం నూతన ప్రణాళికను రూపొందించింది. వానాకాలం సీజన్‌లో రైతులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించేందుకు 'రైతు ముగింట్లో శాస్త్రవేత్తలు' అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ కార్యక్రమంలో భాగంగా ఈనెల 5 నుంచి జూన్ 13వ తేదీ వరకు శాస్త్రవేత్తలు రైతుల వద్దకే వెళ్లి పంటల సాగుపై అవగాహన కల్పిస్తారు. ఈ కార్యక్రమ నిర్వహణ బాధ్యతను ప్రభుత్వం ఆచార్య జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయానికి అప్పగించింది.

- (ఆంధ్రజ్యోతి,నల్లగొండ)



ఈ నెల 5 నుంచి

రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు

- » జూన్ 13 వరకు అవగాహన కార్యక్రమాలు
- » వానకాలం సీజన్‌పై రైతులకు సలహాలు, సూచనలు
- » శాస్త్రవేత్తలతో పాటు వ్యవసాయశాఖ అధికారులకు బాధ్యతలు

'రైతు ముగింట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమంలో భాగంగా శాస్త్రవేత్తలతో పాటు వ్యవసాయ అధికారులు, ఏఈవోలతో పాటు ఎంపీవోలు, జిల్లా వ్యవసాయ అధికారులు రైతుల వద్దకు వెళ్తారు. అందుకు సంబంధించి అధికార యంత్రాం గం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు రైతుల వద్దకు వెళ్లినప్పుడు సుస్థిర సాగు విధానాలు, పం టల పరిరక్షణ, తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించే పద్ధతులపై శాస్త్రీయ సూచనలు అందజేస్తారు. ప్రస్తుతం రైతులు ఎదుర్కొంటు న్న వాతావరణ పరిస్థితులు, నీటి కొరత, భూమిలో సారం తగ్గడం వంటి ప్రధాన సవాళ్లను రైతులు ఎదుర్కొనేలా శాస్త్రవేత్తలు ప్రత్యక్షంగా పరిష్కార మార్గాలు సూచిస్తారు.

రైతులను నష్టాల నుంచి గట్టెక్కించేలా

సుస్థిర వ్యవసాయ విధానాలపై అవగాహన పెంచడంతో పాటు రైతులను నష్టాల నుంచి గట్టెక్కించి లాభాదాయక వ్యవసాయం వైపు చైతన్యవంతం చేస్తారు. దీంతో పాటు వ్యవసాయ అనుబంధ రంగాలపై ప్రత్యేక దృష్టి సారించనున్నారు. ప్రధానంగా వరి, పత్తితో పా టు అనుబంధ వ్యవసాయమైన ఉద్యాన పంటలు అంటే బత్తాయి, నిమ్మ, మామిడి, తదితర పం టలతో పాటు కూరగాయల సాగుపై అవగాహన కల్పిస్తారు. రైతులకు నూతన సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పిస్తారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు నల్లగొండ జిల్లాలోని కంపాసాగర్‌లో ఉన్న కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలతో పాటు జిల్లా వ్యవసాయశాఖ అధికారులు సమగ్ర ప్రణాళికను రూపొందించి ముందుకు సాగుతున్నారు. రైతు ముగింట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమం ద్వారా ప్రతీ రైతుకు తక్షణ సహాయం అందించాలనేది ప్రభుత్వ ఉద్దేశం

- మిగతా 3వ పేజీలో...

జిల్లాల్లో ఇలా..

రైతు ముగింట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమంలో భాగంగా ఈనెల 5 నుంచి 13వ తేదీ వరకు గ్రామపంచాయతీ భవనాల వద్ద సమావేశాలను, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారు. నిడమనూరు మండలంలోని బంకాపురం, తుమ్మడం, నిడమనూరు, శాఖాపురం, వెనిగండ్ల, బొక్కమంతలపహాడ్, గుంటిపల్లి, వల్లభాపురం గ్రామాల్లో కేటాయించిన తేదీల్లో శాస్త్రవేత్తలు పర్యటించనున్నారు. త్రిపురారం మండలంలోని కంపసాగర్, బాబుసాయిపేట, పెద్దదేవులపల్లి, మాటూరు, రాగడప, బెంజికల్, అనుముల మండలంలోని నాయుడుపాలెం, ఇబ్రహీంపేట్, తిమ్మాపురం, చల్మారెడ్డిగూడెం, హజారిగూడెం, మాదారిగూడెం, పాలెంలలో శాస్త్రవేత్తలు పర్యటించనున్నారు. తిప్పర్తి మండలంలోని తిప్పలమ్మగూడెం, మిర్యాలగూడ మండలం వీరప్పగూడెం, తిరుమలగిరి మండలం నెల్లికల్ గ్రామాల్లో ముందుగా నిర్ణయించిన తేదీల ప్రకారం శాస్త్రవేత్తలు గ్రామాలకు వెళ్లి అవగాహన కల్పిస్తారు. తక్కువ యూరియా వాడకంతో పాటు సాగు ఖర్చును కూడా తగ్గించాలని, రైతులు అవసరం మేరకు మాత్రమే రసాయనాలను వినియోగించాలని, నేల తల్లిని కాపాడాలని శాస్త్రవేత్తలు వివరించనున్నారు. అదే విధంగా విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు కొనుగోలు చేశాక బిల్లులను భద్రపర్చుకొని నష్టపరిహారం పొందేలా, సాగునీటిని ఆదా చేసేలా పంట మార్పిడి చేసి సుస్థిర ఆదాయాన్ని పొందేలా, చెట్లను పెంచి పర్యావరణాన్ని కాపాడేలా శాస్త్రవేత్తలు రైతులకు అవగాహన కల్పించనున్నారు.

నేతన్నకు రుణమాఫీ



- » రూ.లక్ష లోపు ఉన్నవారికి వర్తింపు
- » ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- » యాదాద్రిలో 1,159 మందికి లబ్ధి
- » రూ.8.40కోట్ల మాఫీకి అవకాశం

భూదాన్‌పోచంపల్లి, మే 3 (ఆంధ్రజ్యోతి): చేనేత కార్మికులకు తీపి కబురు. నేతన్నలకు రుణమాఫీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు జీవో నెంబరు 56ను జారీ చేసింది. రూ.లక్ష లోపు రుణాలు తీసుకున్న వారికి మాత్రమే రుణమాఫీ వర్తించనుంది. గత ఏడాదిన సెప్టెంబరు 9న హైదరాబాద్‌లో (నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ - ఎన్‌ఐహెచ్‌టీ) జాతీయ చేనేత సాంకేతిక సంస్థ ప్రారంభోత్సవం సందర్భంగా రైతుల్లాగా చేనేత వృత్తిపై ఆధారపడిన నేత కార్మికులకు కూడా రుణమాఫీ చేసి ఆదుకుంటామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఉన్నతస్థాయి ఆదేశాల మేరకు రూ.లక్ష లోపు రుణాలు తీసుకున్న చేనేత కార్మికుల వివరాలను చేనేత, జౌళిశాఖ అధికారులు ప్రభుత్వానికి అందజేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా ఎన్నికల కోడ్ అమలులోకి రావడం, తదితర కారణాలతో రుణమాఫీ అమలులో కొంత జాప్యం జరిగింది. ఎట్టకేలకు రుణమాఫీకి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

రూ.33కోట్ల నిధులు మంజూరు

రాష్ట్ర వ్యాప్తంగా నేతన్నల రుణమాఫీ కోసం మొదటి దఫా రూ.33 కోట్ల నిధులు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 2017 ఏప్రిల్ 1నుంచి 2024 మార్చి 31వ తేదీ వరకు బ్యాంకుల్లో వ్యక్తిగత రుణాలు తీసుకున్న వారికి మాత్రమే ఈ రుణమాఫీ వర్తిస్తుంది. యాదాద్రి జిల్లాలో 1,162 మందికి రూ.8.4కోట్లు మాఫీ కానున్నాయి. అందులో ఒక్క భూదాన్‌పోచంపల్లి పట్టణంలో 234 మంది దాకా కార్మికులకు లబ్ధికలగనుంది.

జూన్ 1వరకు అమలుకు కృషి



జిల్లాలో మొత్తం 1,162 మందికి రూ.8.40కోట్ల రుణాలు మాఫీ కానున్నాయి. ఇప్పటికే బ్యాంకుల ద్వారా రుణగ్రస్తుల వివరాలు సేకరించాం. జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి కమిటీ నిర్ధారించిన మేరకు జాబితాను రాష్ట్ర ఉన్నత అధికారులకు నివేదిస్తాం. త్వరలో రుణమాఫీ ప్రక్రియ జరుగుతుంది.

ఏ.శ్రీనివాస్‌రావు, జిల్లా చేనేత, జౌళిశాఖ అసిస్టెంట్ డైరెక్టర్

ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు



చేనేత కార్మికులకు రూ.లక్ష లోపు రుణమాఫీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినందుకు సంతోషంగా ఉంది. చేనేత కార్మికుల సమస్యలను గుర్తించిన రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. రైతుల మాదిరిగానే చేనేత కార్మికులకు తప్పని సరిగా రుణమాఫీ చేస్తామని చెప్పారు. ఇచ్చిన మాట ప్రకారం రుణమాఫీ చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు.

అంకం పాండు, పోచంపల్లి చేనేత కార్మిక సంఘం అధ్యక్షుడు

గిరిజన తండాల అభివృద్ధికి

జాతీయ పథకాల అమలు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి, పాల్గొన్న ఎమ్మెల్యే బాలునాయక్

- » దేవరకొండ నియోజకవర్గంలో 29 గ్రామపంచాయతీల్లో కార్యక్రమాలు
- » కలెక్టర్ ఇలా త్రిపాఠి

కొండమల్లేపల్లి, మే 3 (ఆంధ్రజ్యోతి): గిరిజన తండాల అభివృద్ధికి జాతీయ పథకాలు అమలు చేయనున్నట్టు కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. శనివారం దేవరకొండ ఎంపీడీవో కార్యాలయంలో ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్‌తో కలిసి జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. దేవరకొండ నియోజకవర్గంలో ధర్తి జన్ జాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియాన్ యోజన పథకం 29 గ్రామపంచాయతీలను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం 70శాతం, రాష్ట్ర ప్రభుత్వం 30 శాతం నిధులతో ఈ పథకాన్ని అమలు చేస్తున్నట్టు చెప్పారు. 50శాతం గిరిజన జనాభా ఉన్న గ్రామాలను ఎంపిక చేశామన్నారు. గ్రామాల్లో సివిల్ పనులపై ఎక్కువ దృష్టి కేంద్రీకరించామని, తాగునీరు, అంగన్‌వాడీ, పంచాయతీరాజ్, విద్య, వైద్యం, మత్స్య సంపద అభివృద్ధి పనులు చేపడతామన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ద్వారా తాగునీటి సంపులను ప్రతిపాదించాలని అన్నారు. రెడ్కో ద్వారా సోలార్ పవర్ ఏర్పాటు చేయాలన్నారు. ఐసీడీఎస్ ద్వారా అంగన్‌వాడీ భవనాలకు ప్రతిపాదనలు పంపాలని, అదే విధంగా దీర్ఘకాలిక పనులకు ఉపయోగపడేలా చూడాలని అన్నారు. పంచాయతీ భవనాలు లేని కొత్త పంచాయతీలలో వాటి నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాలని అన్నారు. అలసత్వం వహించకుండా అధికారులు కేంద్ర పథకాన్ని పకడ్బందీగా చేపట్టాలని ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే బాలునాయక్ మాట్లాడుతూ. ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టే పథకాలన్నింటికీ సాధ్యమైనంత ఎక్కువ లబ్ధిదారులు సద్వినియోగం చేసుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఏదైన కొత్త పథకం వచ్చినప్పుడు జాగ్రత్తగా అధ్యయనం చేసి సాధ్యమైనంత ఎక్కువ మంది వినియోగించుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పథకం మంజూరు, అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి

(ఆంధ్రజ్యోతి, కనగల్): అకాల వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. శనివారం కనగల్ పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె తనిఖీచేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. రైతులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు.

కుమ్మరిగూడెం గ్రామానికి చెందిన రైతు మాచర్ల సైదులు లారీల కొరత కారణంగా ధాన్యం కొనుగోలులో జాప్యం చేస్తున్నారని కలెక్టర్‌కు వివరించగా, లారీల కొరత లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆమె ఆదేశించారు. సీరియల్ ప్రకారం ధాన్యం కాంటాలు వేయాలన్నారు. రైతులను ఇబ్బందులకు గురిచేయకుండా కొనుగోళ్లు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో డీసీవో పార్థనాయక్, డీఎస్‌వో వెంకటేశ్వర్లు, పౌరసరఫరాలశాఖ డీఎం హరీష్, తహసీల్దార్ పద్మ, ఆర్‌ఐ యాదగిరి, పీఏసీఎస్ సిబ్బంది గిరి, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బ బారిన పడకుండా

జాగ్రత్తలు తీసుకోవాలి

కలెక్టర్ ఇలా త్రిపాఠి



నల్లగొండ టౌన్, మే 3 (ఆంధ్రజ్యోతి): వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని వడదెబ్బ బారిన పడకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి శనివారం ఒక ప్రకటనలో కోరారు. అధిక ఉష్ణోగ్రతల కారణంగా వడదెబ్బకు గురికాకుండా వైద్యారోగ్యశాఖతో పాటు, ఇతర శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఎండల తీవ్రత దృష్ట్యా మధ్యాహ్న సమయంలో వీలైనంతవరకు ఇంట్లోనే ఉండాలని, తప్పని పరిస్థితుల్లో బయటికి వెళ్లాల్సి వస్తే టోపీ ధరించడం, తలకు తువ్వాలు చుట్టుకోవడం వంటి జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎక్కువ మోతాదులో తాగు నీరు, మజ్జిగ, పళ్ల రసాలు తీసుకోవాలన్నారు. సులభంగా జీర్ణమయ్యే ఆహారాన్ని భుజించాలని, తేలికపాటి కాటన్ వస్త్రాలను ధరించాలని సూచించారు. కార్యాలయాలు, వ్యాపార, వాణిజ్య సముదాయాల్లో పనిచేసే ఉద్యోగులు, కార్మికులు వడదెబ్బకు గురికాకుండా తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. ఉపాధి కూలీలు ఉదయం వేళల్లోనే పనులు చేసేలా చూడాలన్నారు. అన్ని ఆస్పత్రుల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు

ఇబ్బందులు లేకుండా చూడాలి



రికార్డులను పరిశీలిస్తున్న డీఆర్‌డీఏ పీడీ శేఖర్‌రెడ్డి

డీఆర్‌డీఏ పీడీ శేఖర్‌రెడ్డి

మునుగోడు రూరల్, మే 3 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు కలగకుండా కొనుగోళ్లు చేపట్టాలని డీఆర్‌డీఏ పీడీ శేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండలంలోని పలివెల, కిష్టాపురం, కొరటికల్ గ్రామాల్లో డీఆర్‌డీఏ సెర్ప్(ఐకేపీ) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన తనిఖీచేశారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులు నాణ్యమైన ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తీసుకొని రావాలని, తాలు ఉంటే తప్పకుండా తూర్పారపట్టిన తరువాతే ధాన్యం కొనుగోలు చేయాలన్నారు. కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించిన బిల్లులను వెంటనే సమర్పించాలన్నారు. ఆయన వెంట ఏపీఎం డి.మైసేశ్వరరావు, సీసీలు శ్రీనివాస్, శంకర్, మల్లేశ్వరీ, వీవోఏలు, కమిటీ సభ్యులు, తదితరులు ఉన్నారు.


రోహింగ్యాలకు అడ్డాగా తెలంగాణ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రఘునందన్‌రావు, వేదికపై పార్టీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి తదితరులు

మెదక్ బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు

రామగిరి, మే 3 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రోహింగ్యాలకు అడ్డాగా మారిందని భాగ్యనగర్, మెదక్ వంటి ప్రాంతాల్లోని మదర్సాల పేరుతో జరుగుతున్న ఘటనలపై ప్రభుత్వం ఎందుకు నిర్లక్ష్యం వహిస్తోందని మెదక్ పార్లమెంట్ సభ్యుడు ఎం.రఘునందన్‌రావు ప్రశ్నించారు. శనివారం నల్లగొండలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో ఎక్కడ, ఏం జరిగినా నల్లగొండలోనే మూలాలు కనిపిస్తున్నాయని, నల్లగొండ తీవ్రవాదులకు అడ్డాగా మారిపోయిందన్నారు. రాష్ట్రంలో ఉన్న విదేశీయులను గుర్తించి బయటికి పంపించాలని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారన్నారు. అయితే తెలంగాణ ముఖ్యమంత్రి సోయిలేకుండా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. మెదక్ మదర్సాల్లో జరిగిన ఘటన గురించి అధికారం యంత్రాంగం పట్టించుకోదని, రాష్ట్రంలో ఏ మసీద్‌కు గానీ, ఏ చర్చ్‌కి గానీ మతిస్థిమితం లేని వ్యక్తులు వెళ్లరని, కేవలం హిందు దేవాలయాకు మాత్రమే వెళ్తున్నారని పోలీసులు చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి పాఠశాలలు, ఆసుపత్రులు తనిఖీలు చేయడం మంచిదేనని, వాటిలాగే మదర్సాలను కూడా సందర్శించి అక్కడ ఎవరుంటున్నారు, ఏం చెబుతున్నారు, ఏం జరుగుతుందో విచారించాలని డిమాండ్ చేశారు. జిల్లాలో ఎంతమంది ఐఎస్‌ఐ తీవ్రవాదులు ఉన్నారో ఎస్పీ ప్రకటించాలన్నారు. జిల్లాలో ఇద్దరు సీనియర్ మంత్రులు ఉన్నా, వీరు ఒక్కసారి కూడా ఐకేపీ కేంద్రాలకు వెళ్లి రైతులకు మద్దతు ధర దక్కుతుందా? లేదా? అని విచారించకపోవడం సిగ్గుచేటన్నారు. విలేకరుల సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, నాయకులు చింత సాంబమూర్తి, గోలి మధుసూదన్‌రెడ్డి, వీరెల్లి చంద్రశేఖర్, పిల్లి రామరాజుయాదవ్, పల్లెబోయిన శ్యాంసుందర్, కాలం విజేందర్‌రెడ్డి, గడ్డం మహేశ్, తదితరులు పాల్గొన్నారు.




సాగర్ జలాశయంలో ప్రస్తుత నీరు

డెడ్ స్టోరేజీకి 4అడుగుల దూరం

» సాగర్ ప్రస్తుత నీటిమట్టం 514 అడుగులు » అందుబాటులో ఉన్న నీరు 7టీఎంసీలే • 3లో..


నీట్‌కు అభ్యర్థులు సకాలంలో హాజరుకావాలి



నీట్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండ టౌన్, మే 3 (ఆంధ్రజ్యోతి): నీట్ (నేషనల్ ఎలిజిబులిటీ కమ్ ఎంట్రెన్స్ టెస్ట్)కు అభ్యర్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంతో పాటు ఎంజీ యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను ఎస్పీ శరత్‌చంద్ర పవర్‌తో కలిసి తనిఖీ చేశారు. జిల్లా కేంద్రంలోని రామగిరిలోని మహిళా డిగ్రీ కళాశాలలో, ఎంజీ యూనివర్సిటీలో ఏర్పాటుచేసిన పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసి సౌకర్యాలను, బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, నీట్ కోసం ఎంజీయూలో నాలుగు, ఎన్జీ కళాశాలలో ఒకటి, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఒకటి, కేంద్రీయ విద్యాలయంలో మరో పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. మొత్తం 2,087 మంది ఈ పరీక్షకు హాజరుకానున్నారని తెలిపారు. అభ్యర్థులు ఉదయం 11 గంటలకే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. మధ్యాహ్నం 1.30గంటల తర్వాత పరీక్షా కేంద్రం గేట్లు మూసివేస్తామన్నారు. పరీక్ష మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉంటుందని తెలిపారు. కలెక్టర్ వెంట ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ రాజ్‌కుమార్, అదనపు ఎస్పీ రమేష్, ఆర్డీవో వై.అశోక్‌రెడ్డి, డీఎస్పీ శివరాంరెడ్డి, నీట్ నోడల్ ఆఫీసర్, కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, తదితరులు ఉన్నారు.

పేదోడికే ఇందిరమ్మ ఇల్లు



- నిబంధనలు కఠినతరం చేసిన ప్రభుత్వం
- ఫోర్ వీలర్ ఉంటే అనర్హులు
- 600 చదరపు అడుగులు మించితే బిల్లు రాదు

(ఆంధ్రజ్యోతి-నిడమనూరు): పేదోడి సొంతింటి కలను సాకారం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. పథకం అమలులో భాగంగా సొంత స్థలం కలిగిన వారికి ఇల్లు నిర్మించుకునేందుకు దశలవారీగా రూ.5 లక్షలు ప్రభుత్వం ఇవ్వనుంది. ఇందుకోసం లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను వేగవంతం చేసింది. దీంతో ఆశావహులు ఇళ్ల మంజూరు కోసం ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం మొదటి విడతగా ప్రతీ నియోజకవర్గానికి 3,500 అంటే మండలానికి 600 నుంచి 700 వరకు ఇళ్లు మంజూరు చేస్తోంది. గ్రామానికి 20 నుంచి 30 వరకు వస్తాయన్న మాట. కానీ దరఖాస్తుదారులు పెద్దమొత్తంలో ఎదురుచూస్తున్నారు. ప్రజాపాలనలో పెద్దసంఖ్యలో దరఖాస్తులు చేసుకున్నారు. ఒక్కో గ్రామంలో 100 మందికిపైగా అర్హులను యాప్ ద్వారా అధికారులు గుర్తించారు. లబ్ధిదారుల ఎంపిక ఇటు అధికారులకు అటు ఇందిరమ్మ కమిటీ సభ్యులకు తలనొప్పిగా మారింది. దీంతో ప్రభుత్వం లబ్ధిదారుల ఎంపికకు అనేక నియమ నిబంధనలు రూపొందించింది. ఫోర్ వీలర్ ఉన్నా అనర్హులు. అంటే ట్రాక్టర్ కూడా ఉండకూడదు. ఎల్-1, ఎల్-2, ఎల్-3 అంటూ అనేకసార్లు సర్వేలు చేస్తూ లబ్ధిదారుల ఎంపికను వడపోస్తున్నారు. దీంతో రోజురోజుకు లబ్ధిదారులు తగ్గిపోతున్నారు. నల్లగొండ జిల్లా నిడమనూరు మండలంలో పైలెట్ గ్రామంగా ఎంపిక చేసిన తుమ్మడం గ్రామంలో మొదట 370 మందిని ఇందిరమ్మ లబ్ధిదారులుగా ఎంపికచేశారు. తర్వాత 260కి కుదించారు. చివరగా 100 మందిని ఎంపిక చేశారు. నిజమైన పేదోడికే ఇల్లు మంజూరు చేసే విధంగా ప్రభుత్వం నిబంధనలు కఠినతరం చేసింది. ఇందిరమ్మ లబ్ధిదారుల ఎంపికకు ప్రభుత్వం రూపొందించిన నిబంధనలు కింది విధంగా ఉన్నాయి.

- లబ్ధిదారులు బీపీఎల్ కుటుంబానికి చెందిన వారై ఉండాలి. అంటే దారిద్ర్య రేఖకు దిగువన ఉండాలి.
- దరఖాస్తు చేసిన ప్రాంత నివాసియై ఉండాలి. గ్రామాల్లో నివసించే వారి ఆదాయం ఏడాదికి రూ.లక్షన్నర, పట్టణాల్లో నివసించే వారు రూ.2 లక్షలు ఉండాలి.
- ఖాళీ ఇంటి స్థలం కలిగి ఉండాలి. కనీసం 60 గజాల సొంత స్థలం ఉండాలి.
- ఇంటి స్థలానికి సంబంధించిన దస్తావైజు తప్పనిసరిగా ఉండాలి.
- రెండున్నర ఎకరాల తరి భూమి, మెట్ట భూమి ఐదు ఎకరాల కంటే మించి ఉండకూడదు.
- స్లాబు ఇళ్లలో ఉండేవారు అర్హులు కాదు.
- నాలుగు చక్రాల వాహనం అంటే కారు, ట్రాక్టర్, కోత మిషన్లు ఉంటే అనర్హులు.
- ఆదాయపు పన్ను, ప్రొఫెషనల్ ట్యాక్సులు చెల్లించినా అనర్హులే.
- కుటుంబంలో ఎవరైనా ప్రభుత్వ ఉద్యోగి ఉంటే అనర్హులు.
- సంచార కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయరు.
- తండ్రి, ఇద్దరు కుమారులతో ఉన్నట్లయితే ఒక్కరిని మాత్రమే లబ్ధిదారుడిగా ఎంపిక చేస్తారు.
- ఇంటి నిర్మాణం ఇంతకు ముందు ప్రారంభించినా, పాత ఇంటిని కలిపి కొత్త ఇల్లు నిర్మించినా అనర్హులు అవుతారు.
- ఇంటి నిర్మాణంలో రెండు గదులు, కిచెన్, మరుగుదొడ్డి తప్పనిసరి.
- ఇంటి నిర్మాణం 400 నుంచి 600 చదరపు అడుగుల వరకు మాత్రమే ఉండాలి. అంటే 400 అడుగులకు తక్కువ ఉండరాదు. అదేవిధంగా 600 చదరపు అడుగులకు ఎక్కువ మించి ఉండరాదు. ఏమాత్రం నిబంధనలు ఉల్లంఘించి ఇల్లు కడితే బిల్లు రాదు.
- లబ్ధిదారుడికి 4 విడతలుగా ఇంటి బిల్లులు చెల్లిస్తారు. మొదట బేస్‌మెంట్ నిర్మాణం చేపడితే రూ.లక్ష, పిల్లర్లు వేసి గోడలు కడితే రూ.125 లక్షలు, స్లాబు వేసిన తర్వాత రూ.1.75 లక్షలు, ఇంటి నిర్మాణం పూర్తయిన తర్వాత చివరగా రూ.లక్ష ఇవ్వడం జరుగుతుంది.

ఆటాపాటల సమయం వేసవి



పిల్లలతో సంగీత విభావరి(ఫైల్‌ఫొటో)

వేసవి సెలవుల్లో పిల్లలకు ఆటపాటలపై శిక్షణ ఎంతో ఆహ్లాదాన్ని కలిగిస్తాయి. ఇవి చిన్నారుల భవిష్యత్‌కు పునాదిగా మారుతాయి. అదేవిధంగా సెలవులు వృథా కాకుండా ఉంటుంది. ప్రధానంగా పిల్లలను సెల్‌ఫోన్‌కు దూరంపెట్టి వారికి ఇష్టమైన ఆటలు, పుస్తకపఠనం పెంపొందించడం, కళలలో శిక్షణ పొందేలా చూడాలి. ఇప్పటివరకు పుస్తకాలతో కుస్తీపడిన పిల్లలకు వేసవి సెలవుల్లో విశ్రాంతి దొరికినట్లయ్యింది. ఏడాదంతా పుస్తకాలు, పరీక్షలతో ఒత్తిడిలో ఉన్న విద్యార్థులకు కళలు మానసిక ప్రశాంతతో పాటు ఆనందాన్ని కలిగిస్తాయి. ఆటపాటల్లో ప్రోత్సహిస్తే శారీరక, మానసిక, ఉల్లాసం, చురుకుదనం, మేధాశక్తి వృద్ధి చెందడం వంటి సుగుణాలు అలవాటవుతాయి.

- (ఆంధ్రజ్యోతి-యాదగిరిగుట్ట రూరల్)

విద్యార్థులకు అందుబాటులో లైబ్రరీలు వారికి స్వాగతం పలుకుతున్నాయి. శాస్త్ర, సాంకేతిక, కథలు, కవితలు, అన్నిరకాల పోటీ పరీక్షలకు లైబ్రరీలో అందుబాటులో ఉంటాయి. మేధస్సును పెంచుకోవడానికి ఇది చక్కటి మార్గం. ఉన్నతస్థాయిలో రాణిస్తున్న వారు అందరూ పుస్తకాల పఠనంతోనే ఎదిగిన వారే. పిల్లలు అందుబాటులో ఉన్న లైబ్రరీలను వినియోగించుకుంటే ఎంతో విజ్ఞానం సొంతమవుతుంది.

చిన్నారులకు శిక్షణ... భవితకు రక్షణ!!

టెక్నాలజీపై అవగాహన పెంచుకోవాలి

నేటి సమాజం ప్రస్తుతం టెక్నాలజీ వెంట ఉరుగులు పెట్టాల్సిందే. ఎప్పటికప్పుడు సాంకేతికతపై పరిణతి సాధించాల్సిందే. ప్రతీ ఏటా నిర్వహించే వర్క్‌షాప్ కోసం ఇస్రో విద్యార్థులను ఎంపిక చేస్తోంది. ఇందుకోసం కంప్యూటర్ శిక్షణలో చేరి బేసిక్‌తో పాటు మరికొంత విజ్ఞానాన్ని నేర్చుకోవాలి.

సజీవంగా నిలిచిపోయే చిత్రలేఖనం

సజీవంగా నిలిచిపోయే కళ చిత్రలేఖనం. జిల్లాలో ఎక్కువమంది ఆర్టిస్టులు ఉచితంగా చిత్రలేఖనాన్ని నేర్పిస్తున్నారు. కొంతమంది నామమాత్రంగా డబ్బులు తీసుకొని శిక్షణ ఇస్తూ బొమ్మలు గీయడం నేర్పిస్తున్నారు. మరికొందరు ఆన్‌లైన్ తరగతుల ద్వారా విద్యార్థులను బొమ్మలు గీయడంలో నేర్పరులుగా తీర్చిదిద్దుతున్నారు.



పర్యాటక, దేవాలయాల సందర్శన

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పర్యాటక ప్రాంతాలు ఎన్నో ఉన్నాయి. యాదాద్రిభువనగిరి జిల్లాలో భువనగిరి ఖిలా, పురాతన దేవాలయం కొలనుపాక, యాదగిరిగుట్ట దేవాలయం, సూర్యాపేట జిల్లాలో పిల్లలమర్రి, నల్లగొండ జిల్లాలో నాగార్జునసాగర్ వంటి ప్రాంతాలకు వేసవిలో వెళ్లడం ఆహ్లాదం,ఆనందాన్ని కలిగిస్తాయి. దేవాలయాలకు పిల్లలతో తల్లిదండ్రులు సందర్శించి వారి ప్రాశస్తిని వివరించాలి. కొలనుపాకలో దక్షిణ భారతదేశంలో అతి పెద్ద బౌద దేవాలయం అందులో కోటిలింగాల సమూహం ఉంటుంది. ఇలాంటి చారిత్రక ప్రదేశాలను పిల్లలను తీసుకొని వాటి చరిత్రను వారికి తెలియజేయాలి.

క్రీడల్లో శిక్షణకు తల్లిదండ్రులే బాధ్యత తీసుకోవాలి



వేసవిలో సెలవులు వృథాకాకుండా విద్యార్థులకు ఏదో ఒకరకమైన క్రీడల్లో శిక్షణ ఇప్పించాలి. ఈత, ఆత్మరక్షణ కోసం కరాటే వంటి క్రీడలలో శిక్షణ పొంది ప్రతిభ కనబర్చితే తల్లిదండ్రులకు, దేశానికి ఎంతో పేరు వస్తుంది. విద్యార్థులపై ప్రత్యేక దృష్టిపెట్టి వారి భవితకు బంగారు బాటలు వేసే బాధ్యత తల్లిదండ్రులదే.

-మల్లేశం, రిటైర్డ్ ఉపాధ్యాయుడు, యాదగిరిగుట్ట



నృత్య... సంగీతం శిక్షణ

ప్రధానంగా బాలికలు నృత్యం, సంగీతం నేర్చుకోవడానికి ఎంతో ఇష్టపడుతారు. ఆ శిక్షణతో సమాజంలో పిల్లలతో పాటుగా వారి తల్లిదండ్రులకు సైతం ఎంతోపేరు ప్రతిష్టలు వస్తాయి. అందుబాటులో ఉన్న నృత్య అకాడమీలో చేర్పిస్తే ప్రాయోగిక, ప్రాథమిక స్థాయిలో శిక్షణ ఇచ్చి బ్రహ్మోత్సవాలు, ప్రభుత్వ కార్యక్రమాలలో ప్రదర్శనలు ఇప్పించి ప్రత్యేక గుర్తింపు తెచ్చేలా శిక్షణ కేంద్రాలు చేయూతనిస్తూ వారికి ప్రశంసాపత్రాలు అందిస్తాయి.

వేసవిలో ఉచిత క్రీడా శిక్షణలు



వేసవి సెలవుల్లో విద్యార్థులకు యాదాద్రి జిల్లావ్యాప్తంగా 10 కేంద్రాల్లో క్రీడల శిక్షణ శిబిరాలను ఏర్పాటుచేశాం. ఆయా కేంద్రాల్లో అన్నిరకాల ఆటలకు ఉచితంగా శిక్షణ ఇస్తున్నాం. విద్యార్థులకు భవిష్యత్‌లో అవసరమైన క్రీడలను వారికి కోసం ఫిజికల్ డైరెక్టర్లు ఏర్పాటు చేశాం. శిక్షణ కేంద్రాలను విద్యార్థులు వినియోగించుకోవాలి.

- ధనుంజయ్య, డీవైఎస్‌వో, యాదాద్రిభువనగిరి జిల్లా

లిఫ్ట్ గ్రిల్స్ నుంచి జారిపడి వ్యక్తి దుర్మరణం



శ్రీరాంమూర్తి(ఫైల్‌ఫొటో)

చౌటుప్పల్ రూరల్, మే 3 (ఆంధ్రజ్యోతి) : లిఫ్ట్ గ్రిల్స్ నుంచి జారిపడి ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. సీఐ మన్మథకుమార్ తెలిపిన వివరాల ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం బాపట్ల జిల్లా వినుకొండ మండలం గంగవరం గ్రామానికి చెందిన శ్రీగిరి శ్రీరాంమూర్తి(39) స్థానిక దివీస్ పరిశ్రమలో పనిచేస్తూ చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని సుందరయ్య కాలనీలో భార్యాపిల్లతో కలిసి ఉంటున్నాడు. పిల్లలకు వేసవి సెలవులు రావడంతో భార్య ప్రశాంతి తన ఇద్దరు పిల్లలతో కలిసి తల్లిగారి స్వగ్రామం బాపట్ల జిల్లా ఇరుకుల మండలం తిమిడిపాడు గ్రామానికి వెళ్లింది. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో శ్రీరాంమూర్తి శుక్రవారం రాత్రి చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని రత్నానగర్‌లో నివాసముండే మిత్రుడు అమరనేని రమేష్ ఇంటికి భోజనానికి వెళ్లాడు. రమేష్ నాలుగో అంతస్తులో ఉంటున్నాడు. భోజనం అనంతరం శ్రీరాంమూర్తి ఇంటికి వెళ్లేందుకు లిఫ్ట్ వద్దకు వెళ్లాడు. లిఫ్టు బటన్ నొక్కి లిఫ్టు పైకి రాకముందే బలవంతంగా ఇనుప గ్రిల్స్ డోర్లను తెరిచి కాలుపెట్టాడు. అప్పటికీ కింద ఉన్న లిఫ్ట్ బాక్స్‌పై పడిపోయాడు. శ్రీరాంమూర్తి కేకలు వేయడంతో రమేష్ లిఫ్ట్ వద్దకు వచ్చాడు. తీవ్రగాయాలకు గురైన శ్రీరాంమూర్తిని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడు. భార్య ప్రశాంతికి సమాచారం అందించారు. మృతదేహానికి శనివారం ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. భార్య ప్రశాంతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ మన్మథకుమార్ తెలిపారు.

పురుగుల మందు తాగా, బతికించండి

108 నెంబరుకు ఫోన్‌చేసి యువకుడి వేడుకోలు

దామరచర్ల, మే 3 (ఆంధ్రజ్యోతి): పురుగుల మందు తాగానని, తనను బతికించాలని ఓ యువకుడు 108కు సమాచారం అందించి వేడుకున్నాడు.ఈ సంఘటన నల్లగొండ జిల్లా దామరచర్లలో శనివారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని నర్సాపురం గ్రామానికి చెందిన భూక్య చిన్న వ్యవసాయం చేస్తూ జీవిస్తున్నాడు. కుటుంబ కలహాలతో శనివారం 11.20 గంటల సమయంలో 108 నెంబరుకు ఫోన్ చేసి తాను పురుగుల మందు తాగానని, తనను బతికించాలని కోరాడు. దామరచర్ల శివారులో ఉన్నట్లు రెండు, మూడు ప్రాంతాల పేర్లు తెలిపాడు. 108 సిబ్బంది వాహనంతో భూక్య చిన్న తెలిపిన స్థలాలకు చేరుకుని వెతికారు. అతడి ఆచూకీ లభించేందుకు సుమారు 30 నిమిషాలకు పైగా పట్టింది. పరిసర ప్రాంతాల్లోని కంపచెట్లలో అపస్మారక స్థితిలో ఉండటం గమనించారు. వెంటనే అతడి వద్ద ఉన్న సెల్‌ఫోన్‌లో కుటుంబసభ్యులకు సమాచారం అందించి చికిత్స నిమిత్తం 108లో మిర్యాలగూడ ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు సిబ్బంది ఎర్రబెల్లి శ్రీనివాస్, సైదయ్యలు తెలిపారు. ప్రస్తుతం యువకుడు ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. 108 సిబ్బంది సకాలంలో స్పందించడంతో యువకుడి ప్రాణాన్ని కాపాడారు. పోలీసులకు సమాచారం అందించినట్లు 108 సిబ్బంది తెలిపారు. చిన్న తాను ఉన్న స్థలం అస్పష్టంగా తెలిపినప్పటికీ సమీపంలోని ప్రాంతాలన్నీ వెతికి అతడి ప్రాణాలు కాపాడిన 108 సిబ్బందిని స్థానికులు అభినందించారు. ఇదిలా ఉండగా పోలీసులకు సమాచారం అందించినట్లు 108 సిబ్బంది తెలిపారు.

విద్యుదాఘాతంతో రెండు ఎద్దులు మృతి

పెద్దవూర, మే 3 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా పెద్దవూర మండలం నాయనవాని కుంటతండాలో శనివారం విద్యుదాఘాతంతో రెండు ఎద్దులు మృతి చెందాయి. బాధిత రైతు రమావత్ సైదానాయక్ తెలిపిన వివరాల ప్రకారం తన రెండు ఎద్దులను మేత కోసం గ్రామశివారులోకి తీసుకెళ్లగా శుక్రవారం రాత్రి వీచిన బలమైన గాలులకు విద్యుత్ తీగలు తెగి పడిపోవడంతో ఎద్దులు తీగలకు తగలడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాయన్నారు. ఎద్దుల విలువ సుమారు రూ.1.30లక్షలు ఉంటుందని అధికారులు తనకు నష్ట పరిహారం అందించాలని బాధిత రైతు కోరారు.

కోటమర్తిలో గేదె

అడ్డగూడూరు, మే 3 (ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా అడ్డగూడూరు మండలం కోటమర్తిలో విద్యుదాఘాతంతో పాడి గేదే మృతి చెందింది. రైతు చిన్నబోయిన ప్రహ్లాద తెలిపిన వివరాల ప్రకారం రోజు వారి మాదిరిగా గేదే మేతకు వెళ్లింది. శుక్రవారం రాత్రి ఈదురుగాలులకు పొలంలో పడిన సర్వీస్ వైరుకు తగిలి విద్యుదాఘాతానికి గురై గేదె అక్కడికక్కడే మృతి చెందిందని రైతు తెలిపారు. గేదె విలువ సుమారు రూ.80వేలు ఉంటుందని ప్రభుత్వం తనను ఆదుకోవాలని రైతు తెలిపారు.

బైక్ దగ్ధం చేసిన గుర్తుతెలియని వ్యక్తులు

చింతపల్లి, మే 3 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా చింతపల్లి మండలంలో గుర్తుతెలియని వ్యక్తులు ద్విచక్రవాహనాన్ని శనివారం దగ్ధం చేశారు. ఎస్‌ఐ యాదయ్య తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కిష్టరాయినిపల్లి గ్రామానికి చెందిన మోర శ్రీరాములు లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అతడు సొంత పని నిమిత్తం శుక్రవారం బైక్‌పై చింతపల్లికి వెళ్లి తిరిగి ఇంటికి చేరుకున్నాడు. తన బైక్‌ను పంచాయతీ ముందు నిలిపి సమీపంలోని ఇంట్లోకి వెళ్లి భోజనం చేసి నిద్రపోయాడు. ఇదే సమయంలో శ్రీరాములు తండ్రి రామచంద్రం అర్ధరాత్రి ఒంటి గంటకు బహిర్భూమికి వెళ్దామని బయటకు వచ్చారు. ఆ సమయంలో బైక్ లోనుంచి ఒక్కసారిగా మంటలు రావడం గమనించాడు. విషయం కుమారుడు శ్రీరాములకు చెప్పగా వచ్చేలోగా అప్పటికే బైక్ దగ్ధమైంది. మంటలను ఆపేందుకు ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. శ్రీరాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఖాళీ లారీ కనబడితే కొనుగోలు కేంద్రానికే!



నార్కట్‌పల్లిలోని నల్లగొండ ఫ్లైఓవర్ వద్ద లారీలను ఆపుతున్న రవాణా శాఖ సిబ్బంది

నార్కట్‌పల్లి, మే 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యం ఎగుమతికి ఆటంకంగా మారిన లారీల కొరతను తీర్చేందుకు అధికారులు అన్ని ప్రయత్నాలు చేస్తున్నారు. కేంద్రాల నుంచి మిల్లుల వద్దకు చేరిన ధాన్యాన్ని పలు కారణాలతో దిగుమతి చేసుకోవడానికి మిల్లర్లు నిరాకరిస్తుండటంతో ధాన్యం లోడుతో మిల్లుల వద్దే రోజులతరబడి లారీలు నిలిచిపోతున్నాయి. దీంతో కొనుగోలు కేంద్రాల నుంచి మిల్లులకు ధాన్యం తరలింపునకు లారీల కొరత ఏర్పడింది. ఇటీవల నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి జిల్లాలోని పలు మండలాల్లోని కొనుగోలు కేంద్రాలను సందర్శించగా ప్రతీ కేంద్రం వద్ద ఇదే సమస్యను నిర్వాహకులు లేవనెత్తారు. సకాలంలో లారీలు రాకపోవడంతోనే ధాన్యం తూకం వేయడం లేదని కేంద్రాల నిర్వాహకులు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. ఈ సమస్యపై ప్రత్యేకదృష్టి సారించిన కలెక్టర్ స్వయంగా మిర్యాలగూడకు వెళ్లి మిల్లర్లతో చర్చించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నా లారీల కొరత ఏర్పడింది. ఉదాహరణకు నార్కట్‌పల్లి లారీ అసోసియేషన్ పరిధిలో 150 లారీలు ఉండగా వీటిలో సగానికి పైగా ధాన్యం తరలింపు కోసమే కేటాయించగా వీటిలో 40లారీలకు పైగా ధాన్యం లోడుతో వెళ్లిన లారీలు రోజుల తరబడి వేచిఉన్నాయని లారీల యజమానులు చెబుతున్నారు. ఇవిపోగా మిగతా కొన్ని లారీలు స్థానిక కంపెనీల ఉత్పత్తుల రవాణా కోసం వెళ్తున్నాయి. దీంతో లారీల కొరతతో నార్కట్‌పల్లి, చిట్యాల, శాలిగౌరారం, కట్టంగూరు మండలాల్లో ధాన్యం కొనుగోలు నిలిచాయి. ఈ క్రమంలో ధాన్యం కొనుగోలు వేగవంతానికి ప్రత్యామ్నాయ చర్యలపై దృష్టి సారించిన కలెక్టర్ కేంద్రాల వద్దకు లారీలను పంపించే బాధ్యతను రవాణాశాఖ అధికారులకు అప్పగించారు. దీంతో వారు రంగంలోకి దిగి కొనుగోలు కేంద్రాలకు లారీలను పంపే పనిలో నిమగ్నమయ్యారు. నార్కట్‌పల్లి శివారు నల్లగొండ బైపాస్ ఫ్లైఓవర్ వద్ద ఎంవీఐ స్థాయి అధికారి తమ సిబ్బందితో మకాం వేసి ఆ రోడ్డు మీదుగా ఆయా ప్రాంతాలకు ఖాళీగా వెళ్లే లారీలను ఆపి తనిఖీ చేస్తున్నారు. లోడు కోసం వెళ్తున్నారా లేదా ఏదైనా లోడును దిగుమతి చేసి వస్తున్నారా వివరాలు తెలుసుకుని ధాన్యం కొనుగోలు కేంద్రాలకు నిర్బంధంగానే తరలిస్తున్నారు.

బోనస్ కోసం బార్డర్ దాటి



పట్టుకున్న ధాన్యం లారీలతో పోలీసులు

మిర్యాలగూడ అర్బన్, మే 3 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో సన్న బియ్యం ధాన్యానికి ప్రభుత్వం అందిస్తున్న బోనస్ రూ.500 కోసం దొడ్డిదారిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి తరలిస్తున్న ఎనిమిది లారీల ధాన్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. శనివారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడ రూరల్‌పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ రైతుల నుంచి తక్కువధరకు కొనుగోలు చేసిన ధాన్యాన్ని అర్ధరాత్రి వేళలో ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టు సిబ్బంది కన్నుగప్పి జిల్లాలో ప్రవేశిస్తున్నట్లు గుర్తించామన్నారు. నాగార్జునసాగర్, వాడపల్లి చెక్‌పోస్టులు దాటి జిల్లాలోకి ప్రవేశించేందుకు యత్నిస్తున్న ధాన్యం లారీలను 20రోజులుగా నియంత్రిస్తున్నామన్నారు. ఏపీ రాష్ట్రంలోని పల్నాడు, గుంటూరు, ప్రకాశం, ఒంగోలు, కర్నూలు, నెల్లూరు జిల్లాల నుంచి తరలివస్తున్న సుమారు 100 లారీలను వెనక్కుపంపినట్లు డీఎస్పీ తెలిపారు. శుక్రవారం వాడపల్లి చెక్‌పోస్టు నుంచి జిల్లాలోకి అక్రమంగా ప్రవేశిస్తున్న ఏడు లారీలను పట్టుకోగా, శనివారం ఉదయం మరో ధాన్యం లారీని స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. బోనస్‌ను కాజేసుందుకు అనుకూలంగా ఉన్న ప్రాంతాల్లో ఏర్పాటైన ఐకేపీ కేంద్రాల్లో విక్రయించేందుకు సిద్ధపడినట్లు తమ ప్రాథమిక విచారణలో తేలిందన్నారు. వాడపల్లి చెక్‌పోస్టు వద్ద స్వాధీనం చేసుకున్న ఎనిమిది లారీల్లో సుమారు 2,200ధాన్యం బస్తాలున్నట్లు (165టన్నులు) గుర్తించామన్నారు. ధాన్యాన్ని నల్లగొండ, హుజూర్‌నగర్, నిజామాబాద్ జిల్లా ఖనాపూర్‌కు చేరవేస్తున్నట్లుగా గుర్తించారు.

పట్టుబడ్డ లారీల్లోని ధాన్యానికి నష్టం జరగకుండా ఎస్పీ శరత్‌చంద్రపవార్, సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్ సూచన మేరకు తగు చర్యలు తీసుకుంటామని డీఎస్పీ అన్నారు. ఇప్పటి వరకు 14మంది ప్రమేయం ఉన్నట్లు గుర్తించి కేసు నమోదుచేశామన్నారు. పూర్తివిచారణ అనంతరం నిందితుల వివరాలు వెల్లడిస్తామన్నారు. సమావేశంలో రూరల్‌సీఐ పీఎన్డీ ప్రసాద్, ఎస్ఐలు లక్ష్మయ్య, శేఖర్, పీఎస్ఐ సంజీవరెడ్డి పాల్గొన్నారు.

అదృశ్యమైన యువకుడు శవమయ్యాడు



సాయికుమార్(ఫైల్ ఫొటో)

తుర్కపల్లి, మే 3 (ఆంధ్రజ్యోతి) : మూడు రోజుల క్రితం అదృశ్యమైన యువకుడు శవమై కనిపించాడు. ఈ సంఘటన యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం గోపాల్‌పూర్ గ్రామంలో శనివారం వెలుగులోకి వచ్చింది. గ్రామస్థులు, పోలీస్‌లు తెలిపిన వివరాల ప్రకారం తుర్కపల్లి మండలం గోపాల్‌పూర్ గ్రామానికి చెందిన దాసారం రాములుకు ముగ్గురు కుమారులు, కుమార్తె ఉన్నారు. రెండో కుమారుడు దాసారం సాయికుమార్(30) ఇంటి వద్దే ఉంటూ వ్యవసాయ పనులు చేస్తున్నాడు. ఈ నెల 1న రోజులాగే బావి వద్దకు వెళ్లి తిరిగిరాలేదు. దీంతో కుటుంబ సభ్యులు అతడి ఆచూకీ కోసం పరిసర ప్రాంతాలు వెతకడంతో పాటు తమ బంధువుల వద్దకు వెళ్లాడేమోనని ఆరాతీశారు. అయినా ఆచూకీ లేకపోవడంతో ఈ నెల 2న తుర్కపల్లి పోలీస్‌స్టేషన్‌లో తండ్రి రాములు ఫిర్యాదుచేశాడు. పోలీస్‌లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా సిద్ధిపేట జిల్లా ములుగు మండలం బస్వాపూర్ శివారులో యువకుడిని హత్య చేసి పెట్రోలు పోసి దహనం చేసిన గుర్తుతెలియని శవం ఆచూకీ ములుగు పోలీసులకు సమాచారం శుక్రవారం అందింది. దీంతో వారు మృతదేహాన్ని గజ్వేల్ ఆసుపత్రిలో మార్చురీలో ఉంచి చుట్టుపక్కల ఉన్న పోలీస్‌స్టేషన్లకు సమాచారాన్ని అందించారు. తుర్కపల్లి పోలీస్ స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదు కావడంతో పోలీసులు సాయికుమార్ తల్లిదండ్రులకు సమాచారాన్ని అందించారు. ఆయన కుటుంబసభ్యులు మార్చురీకి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహంపై ఉన్న టాటును గుర్తించి తమ కుమారుడు సాయికుమారుడేనని గుర్తించారు. తన కుమారుడిని గుర్తుతెలియని వ్యక్తులు హత్య చేసి పెట్రోలు పోసి కాల్చారని తండ్రి రాములు ఫిర్యాదు చేశాడు. ఆ మేరకు పోలీసులు విచారణ ప్రారంభించారు.

బాలికపై అత్యాచారయత్నం

కొండమల్లేపల్లి, మే 3 (ఆంధ్రజ్యోతి):నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లిలో బాలికపై అత్యాచారయత్నం జరిగింది. ఎస్ఐ రాంమూర్తి శనివారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కొండమల్లేపల్లి మండలకేంద్రంలోని సబ్‌స్టేషన్‌లో అనుముల శ్రీను అర్టిజన్‌గా విధులు నిర్వహిస్తూ స్థానికంగా నివాసముంటున్నాడు. గురువారం రాత్రి 7.30గంటల ప్రాంతంలో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో 14ఏళ్ల బాలికపై అత్యాచారయత్నం చేశాడు. బాలిక కేకలు వేయడంతో శ్రీను పరారయ్యాడు. బాలిక తల్లిదండ్రులు ఫిర్యాదుచేయడంతో పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాంమూర్తి తెలిపారు.

108 అంబులెన్స్‌ను వెనుక నుంచి ఢీకొట్టిన అంబులెన్స్



దెబ్బతిన్న అంబులెన్స్ ముందుభాగం

కొండమల్లేపల్లి, మే 3 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లి మండలంలో 108 వాహనాన్ని వెనక నుంచి అంబులెన్స్ ఢీకొట్టింది. ఈ ఘటనలో ఐదుగురికి స్వల్పగాయాలయ్యాయి. కోల్‌ముంతల్‌పహాడ్ పంచాయతీ సమీపంలోని బాపూజీనగర్ వద్ద కొండమల్లేపల్లి నుంచి రోగిని తీసుకొని దేవరకొండ వైపునకు వెళ్తున్న 108 అంబులెన్స్ అకస్మాత్తుగా బ్రేక్ వేయడంతో వెనుక నుంచి కొండమల్లేపల్లి నుంచి దేవరకొండ వైపు వస్తున్న మరో 108 అంబులెన్స్ వెనుక నుంచి ఢీకొట్టింది. ఇదే క్రమంలో కొండమల్లేపల్లి నుంచి దేవరకొండకు ప్యాసింజర్లను ఎక్కించుకొని వెళ్తున్న ఆటో అంబులెన్స్‌ను తప్పించబోయి పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న నలుగురు ప్రయాణికులతో పాటు అంబులెన్స్ డ్రైవర్‌కు సాధారణ గాయాలయ్యాయి. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని అంబులెన్స్, ఆటోను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సాధారణ గాయాలు కావడంతో పెద్ద ప్రమాదం తప్పినట్లయ్యింది.

గూడపూర్‌లో ఇంటి ఆవరణలో కొబ్బరిచెట్టుపై పిడుగు



పిడుగుపాటుకు దగ్ధమైన టీవీ, ఇతర సామగ్రి

మునుగోడు రూరల్, మే 3 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా మునుగోడు మండలం గూడపూర్ గ్రామంలో శుక్రవారం రాత్రి ఈదురుగాలులతో కూడిన వర్షంలో కొమ్మన బోయిన సరిత ఇంటి ఆవరణలోని కొబ్బరిచెట్టుపై పిడుగు పడింది. దీంతో ఇంట్లో ఉన్న టీవీ, సెల్‌ఫోన్లు, ఇంటి విద్యుత్ వైరింగ్ పూర్తిగా కాలిపోయింది. ఇంట్లో ఉన్న వారికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. పిడుగుపాటుకు ఉలిక్కిపడ్డారు.

15 ట్రాక్టర్ల ఇసుక పట్టివేత

పెన్‌పహాడ్, మే 3 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండలం దోసపాడు గ్రామసమీపంలో గుర్తుతెలియని వ్యక్తులు 15 ట్రాక్టర్ల ఇసుకను డంపు చేశారు. శనివారం సమాచారం తెలుసుకున్న తహసీల్దార్ దరావత్ లాలునాయక్, ఎస్ఐ గోపికృష్ణతో వెళ్లి ఇసుక డంపును సీజ్ చేశారు. ఈ సమాచారాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకురాగా వారిచ్చిన ఆదేశానుసారం పెన్‌పహాడ్ మండలంలోని దుబ్బతండా గ్రామంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఇసుకను లబ్ధిదారులకు సరఫరా చేశారు.

పాఠ్య పుస్తకాలొచ్చేశాయ్



సూర్యాపేట జిల్లా కేంద్రంలోని జడ్పీహెచ్ బాలుర పాఠశాలలో నిల్వ ఉన్న పాఠ్యపుస్తకాలు

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసి పేదలకు ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనేక విధాలుగా చర్యలు చేపట్టింది. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు శాతాన్ని పెంచేందుకు విద్యార్థులకు ఉచితంగా పాఠ్య పుస్తకాలు, ఏకరూప దుస్తులు, మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తోంది. విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందించేందుకు జిల్లాలో అవసరమైన పాఠ్య పుస్తకాలు ఇప్పటి కే జిల్లా కేంద్రానికి చేరుకున్నా యి. పాఠశాలలు పునఃప్రారంభం కాగానే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను అందించనున్నారు. - (ఆంధ్రజ్యోతి,సూర్యాపేట(కలెక్టరేట్)

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించే విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా పాఠ్య పుస్తకాలు అందజేస్తుంది. అందులో భాగంగా ఈ ఏడాది విద్యా సంవత్సరంలో విద్యార్థులకు అందించేందుకు అవసరమైన పాఠ్య పుస్తకాలు జిల్లాకు చేరాయి. ఒకటి నుంచి పదోతరగతి వరకు చదివే విద్యార్థులకు తెలుగు, ఇంగ్లిష్ మీడియాలకు సంబంధించిన పాఠ్య పుస్తకాలు వచ్చాయి. గతంతో పోలిస్తే ఈ ఏడాది విద్యార్థులకు అవసరమైనన్నీ పాఠ్య పుస్తకాలు ముందుగానే జిల్లాకు చేరుకున్నాయి.

ఈనెలాఖరుకు ఎమ్మార్సీలకు తరలింపు

జిల్లాకు చేరిన పాఠ్యపుస్తకాలను జిల్లా కేంద్రంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో నిల్వ చేశారు. ఇంకా కొన్ని పాఠ్యపుస్తకాలు రావాల్సి ఉంది. అయితే జిల్లాకు చేరిన పాఠ్యపుస్తకాలను ఈనెలాఖరులోపు జిల్లాలోని మండల విద్యాధికారుల కార్యాలయాలకు తరలించనున్నారు. అక్కడి నుంచి ఆయా మండలాల పరిధిలోనిపాఠశాలలకు పంపిణీ చేయనున్నారు.

» పాఠశాలల ప్రారంభంలోనే విద్యార్థులకు అందజేతకు చర్యలు
» పక్కదారి పట్టకుండా సీరియల్ నంబర్లు

పక్కదారి పట్టకుండా ..

ప్రభుత్వం ఉచితంగా అందజేసే పుస్తకాలను కొందరు అధికారులు పక్కదారి పట్టించి సొమ్ము చేసుకుంటారు. అయితే పాఠ్య పుస్తకాలు పక్కదారి పట్టకుండా ఉండేందుకు విద్యాశాఖాధికారులు కొత్త విధానాన్ని అమలు చేస్తున్నారు. పాఠ్య పుస్తకాలపై సీరియల్ నంబర్లను ముద్రిస్తున్నారు. వాటి ఆధారంగా జిల్లాకు ఎన్ని పుస్తకాలు సరఫరా జరిగాయో తెలుస్తోంది. అలాగే జిల్లా కేంద్రం నుంచి మండలాలకు పాఠ్య పుస్తకాలను పంపిణీ చేసే సమయంలో కూడా నంబర్లను నమోదు చేయనున్నారు. అక్కడి నుంచి ఆయా పాఠశాలలకు పంపిణీ చేసే సమయంలో ఎంఈవోలు, పాఠశాలల్లో విద్యార్థులకు అందించే సమయాల్లో హెచ్ఎంలు నంబర్లను నమోదు చేసుకోనున్నారు. ఒకవేళ పాఠ్య పుస్తకాలు బహిరంగ మార్కెట్‌లో కనిపిస్తే వాటిపై నమోదు చేసిన నంబర్ ఆధారంగా ఎవరు విక్రయించారో తెలుసుకునే అవకాశాలు ఉన్నాయి. దీని వలన పా ఠ్య పుస్తకాలను పక్కదారి పట్టకుండా నియంత్రించే అవకాశాలు లేకపోలేదు.

ప్రతి విద్యార్థికి పుస్తకాలు అందజేస్తాం



ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించే ప్రతి విద్యార్థికి ఉచితంగా పాఠ్యపుస్తకాలు అందజేస్తాం. ఈ విద్యా సంవత్సరానికి సంబంధించిన అన్ని సబ్జెక్టుల పాఠ్య పుస్తకాలు కొన్ని ఇప్పటికే జిల్లాకు చేరాయి. ఇంకా కొన్ని రావాల్సి ఉంది. అధికారులు పక్కదారి పట్టిస్తే చర్యలు తప్పవు.

- అశోక్‌కుమార్, డీఈవో సూర్యాపేట.

జిల్లాకు చేరిన 1, 79,110 పుస్తకాలు

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించే విద్యార్థులకు అందించేందుకు ప్రస్తుతానికి జిల్లాకు 1,79,110పాఠ్య పుస్తకాలు వచ్చాయి. జిల్లాలో 698 ప్రాథమిక, 80 ప్రాథమికోన్నత, 238 జడ్పీ ఉన్నత పాఠశాలలతో పాటు 18 కస్తూర్బాగాంధీతో పాటు 9 ఆదర్శ పాఠశాలలతో పాటు మైనార్టీ, సాంఘిక సంక్షేమ, గిరిజన, బీసీ సంక్షేమ బాలుర, బాలికల గురుకుల పాఠశాలలు కలిపి మొత్తం 1,050 ఉన్నాయి. ఈ పాఠశాలల్లో సుమారు 90వేల మందికిపైగా విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. వారికి అవసరమైన అన్ని సబ్జెక్టులకు సంబంధించి తెలుగు, ఇంగ్లిష్ మీడియంలో 4,65,600పుస్తకాలు అవసరమున్నాయి. అయితే ఇప్పటికే జిల్లాకు కొన్ని పుస్తకాలు సరఫరా కాగా అవి మినహాయించి జిల్లాకు ఇంకా ప్రభుత్వం 3,55,180 పుస్తకాలు రావాల్సి ఉంది. మిగిలిన పుస్తకాలు పాఠశాలలు ప్రారంభం నాటికి రానున్నాయి.



డెడ్ స్టోరేజీ దిశగా సాగర్ ప్రాజెక్టు

● నాలుగు అడుగుల దూరంలో నీటి మట్టం
● మూడు నెలల తాగు నీటి అవసరాలకు 20 టీఎంసీల నీరు అవసరం
● ప్రస్తుతం అందుబాటులో ఉన్నది 7 టీఎంసీలే

నాగార్జునసాగర్, మే3(ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ ప్రాజెక్టు నీటి మట్టం డెడ్ స్టోరేజీకి నాలుగు అడుగుల దూరంలో ఉంది. సాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 590 అడుగులు(312.0450టీఎంసీలు) కాగా డెడ్ స్టోరేజీ నీటి మట్టం 510 అడుగులు(131.5607టీఎంసీలు), ప్రస్తుతం సాగర్ నీటిమట్టం 514 అడుగులు (138.5610 టీఎంసీలు)గా ఉంది. మరో నాలుగు అడుగులు తగ్గితే సాగర్ నీటి మట్టం డెడ్‌స్టోరేజీకి చేరుకుంటుంది. సాగర్‌లో ప్రస్తుతం డెడ్‌స్టోరేజీకి ఎగువన కేవలం 4 అడుగులు నీరు(7 టీఎంసీలు) మాత్రమే అందుబాటులో ఉంది. సాగర్ ప్రాజెక్టు పరిధిలో రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు, జంటనగరాల తాగునీటి అవసరాలకు మూడు నెలల కాలానికి(సాగర్‌కు వరదలు వచ్చే సమయం వరకు) 20 టీఎంసీలు అవసరం అని ప్రాజెక్టు అధికారులు తెలిపారు. కానీ ప్రస్తుతం సాగర్‌లో 7 టీఎంసీల నీటి లభ్యత మాత్రమే ఉంది. తెలుగు రాష్ట్రాలతో పాటు, జంట నగరాలకు తాగునీటికి ఇబ్బందులు కలగకుండా ఉండాలంటే సాగర్ నుంచి డెడ్ స్టోరేజీకి దిగువకు మరో 10 అడుగుల(500 అడుగులు వరకు) వరకు నీటిని తీసుకోవాల్సి ఉంటుందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు. అంతేకాకుండా సాగర్ నీటి మట్టం డెడ్‌స్టోరేజీకి (510 అడుగులకి)చేరుకుంటే జంటనగరాల తాగు నీటి అవసరాలకు పుట్టంగండి నుంచి నీటిని తరలించాలంటే అక్కడ ఎమర్జన్సీ మోటార్లు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. సాగర్ నీటిమట్టం డెడ్‌స్టోరేజీకి చేరుకున్న ప్రతిసారీ పుట్టగండి వద్ద ఎమర్జన్సీ మోటర్లు ఏర్పాటు చేసి జంటనగరాలకు తాగునీటిని తరలిస్తున్నారు.

మెరుగైన సేవలకు కృషి : ఆర్టీసీ ఆర్ఎం



బస్టాండ్‌లో అధికారులకు సూచనలు చేస్తున్న ఆర్టీసీ ఆర్ఎం జాన్‌రెడ్డి

మిర్యాలగూడ టౌన్, మే 3(ఆంధ్రజ్యోతి): ప్రయాణికులకు మె రుగైన సేవలందించడంతో పాటు సంస్థ ప్రయోజనాల కోసం ఆదాయ మార్గాలను అన్వేషిస్తున్నట్లు ఆర్టీసీ ఆర్ఎం జాన్‌రెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ ఆర్టీసీ బస్టాండును శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తమ పరిధిలోని ప్రధాన డిపోల్లో ఉన్న దుకాణ సముదాయాలను వ్యాపారులకు ఆన్‌లైన్ టెండర్ల ద్వారా కేటాయిస్తున్నట్లు తెలిపారు. కార్గో సేవలను విస్తృత పరచడంతో పాటు ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా ఆయా సెంటర్లను ప్రాంగణంలోని మరో ప్రాంతానికి మార్చే ఆలోచన చేస్తున్నట్లు తెలిపారు. ఆయనవెంట డిపో మేనేజర్ రాంమోహన్‌రెడ్డి, అధికారులు భారతీబాయి, యాదగిరి, జేఆర్‌రెడ్డి ఉన్నారు.

అరుణాచలానికి ప్రత్యేక బస్సులు

నల్లగొండ : పౌర్ణమి సందర్భంగా తమిళనాడులోని అరుణాచల గిరిప్రదిక్షణ కోసం ఈ నెల 10న సాయంత్ర ం 5 గంటలకు జిల్లాలోని అన్ని బస్సు డిపోల నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు ఉమ్మడి నల్లగొండ జిల్లా రీజినల్ మేనేజర్ కె.జాన్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రద్దీని బట్టి అదనంగా బస్సు సర్వీసులు నడపనున్నట్లు పేర్కొన్నారు. అరుణాచలం వెళ్లే భక్తులకు ఆంధ్రప్రదేశ్‌లోని కాణిపాకం, తమిళనాడులోని వేలూరు గోల్డెన్ టెంపుల్ దర్శనం కూడా ఉంటుందని పేర్కొన్నారు. వివరాలకు 9298008888 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

కూలిన 200 ఏళ్ల నాటి చెట్టు



హుజూర్‌నగర్‌లో కూలిన వేప చెట్టు

సూర్యాపేట జిల్లా హుజూర్ నగర్ మండలం గోపాల పురంలోని రామాలయం వద్ద ఉన్న 200ఏళ్ల నాటి భారీ వేప వృక్షం శనివారం నేల కూలింది. గతంలో ఆ వేప చెట్టు మొదల్లో రావిచెట్టు వృక్షం మొలవగా దానిని తొలగించారు. అప్పుడు చెట్టుకు రంధ్రం పడింది. ఇటీవల ఈదురు గాలులు రాగా శనివారం ఉదయం అకస్మాత్తుగా చెట్టు విరిగిపోయింది. చెట్టు చుట్టూ సిమెంట్ అరుగు కట్టగా దానిపై గ్రామంలోని పెదలు, చిన్నలు, వృద్ధులు, నిత్యం సేదతీరుతారు. చెట్టు విరిగిన సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని గ్రామస్థులు పేర్కొన్నారు. నాలుగు తారల క్రితం తాత, ముత్తాలు వేసిన వేపవృక్షం కూలి పోవడం పట్ల గ్రామస్థులు తీవ్ర మనోవేదనకు గురయ్యారు.

● ఆంధ్రజ్యోతి, హుజూర్‌నగర్

ఇళ్ల ఎంపికలో రాజకీయ జోక్యం తగదు



సమావేశంలో మాట్లాడుతున్న మల్లు లక్ష్మి

మోతె, మే 3(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో రాజకీయ నాయకుల జోక్యం తగదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు మల్లు లక్ష్మి అన్నారు. సూర్యాపేట జిల్లా మోతె మండల కేంద్రంలో శనివారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఇళ్లు లేని నిరుపేదలకు రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇవ్వాలన్న లక్ష్యంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పథకంలో రాజకీయ నాయకులు జోక్యం చేసుకోవడం తగదన్నారు. ప్రతి నియోజకవర్గానికి 3, 500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరుచేస్తామని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెప్పి ఎక్కడ కూడా మాట ప్రకారం ఇళ్లు అందజేయడం లేదన్నారు. ప్రజాపాలన గ్రామసభల్లో వందల లబ్ధిదారులను ప్రకటించి గ్రామానికి కేవలం 10 ఇళ్లు మాత్రమే అందిస్తున్నారన్నారు. ఇందిరమ్మ కమిటీలో ఉన్నవారు అనర్హుల పేర్లను నమోదు చేస్తు వారివద్ద డబ్బులు వసూళ్లు చేస్తున్నారన్నారు. మోతె మండలంలోని గోల్‌తండా, రాంపురం తండాతో పాటు మరికొన్ని గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్లు ఇప్పిస్తామని ఒక్కో ఇంటికి రూ. 30వేలు వసూలు చేస్తున్నట్లు గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి, నాయకులు కోట గోపి, నర్సింహారావు, దోసపాటి శ్రీను, మల్లయ్య, పద్మ, ఉదయలీల, అనీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

యాదగిరీశుడికి శాస్త్రోక్తంగా నిత్య పూజలు



నిత్యకల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, మే 3 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామి దివ్యక్షేత్రంలో శనివారం శాస్త్రోక్తంగా నిత్య పూజలు జరిగాయి. సుదర్శన హోమం, నిత్య కల్యాణోత్సవం ఆగమశాస్త్రరీతిలో వైభవంగా చేపట్టారు. శివాలయంలోనూ నిత్యపూజలు కొనసాగాయి. కాగా వివిధ విభాగాల ద్వారా ఆలయ ఖజానాకు రూ.33,24,451ఆదాయం సమకూరినట్లు ఈవో ఎస్.వెంకట్రావు తెలిపారు. కాగా, యాదగిరిగుట్ట దేవస్థానం పెండింగ్ పనులపై దేవాదాయ శాఖ కమిషనర్ కార్యాలయంలో ఈ నెల 5వ తేదీన సమీక్ష సమావేశం జరుగనుంది. ఇందుకోసం పెద్దగుట్టపై టెంపుల్ సిటీ ప్రదేశంలో వేద పాఠశాల నిర్మాణ స్థలం, కొండకింద నిత్యాన్నదాన సత్రాన్ని ఈవో ఎస్.వెంకట్రావు అధికారులతో కలిసి పరిశీలించారు. స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు, జయంతోత్సవాలు అంటూ ఇప్పటికి వాయిదా పడుతుండగా ఎప్పుడు ప్రారంభమయ్యేది ఇంకా స్పష్టత రాలేదు. విదేశాల్లో ఉన్న దాత సమయం కోసం వేచి చూసి, ఆహ్వానించి సత్రాన్ని ప్రారంభించనున్నారు. ఈవో వెంట డీఈవో దోర్బల భాస్కరశర్మ, సివిల్ ఈఈ జిల్లెల దయాకర్, ఏఈ శ్రీనివాస్‌రెడ్డి, ఎలక్ట్రికల్ ఈఈ ఊడెపు వెంకటరామరావు తదితరులు పాల్గొన్నారు.

మిస్ వరల్డ్ పోటీదారులకు ఏర్పాట్లు చేయాలి

భూదాన్‌పోచంపల్లి, మే 3 (ఆంధ్రజ్యోతి): మిస్ వరల్డ్ పోటీదారులకు ఏర్పాట్లు చేయాలని మిస్ వరల్డ్ పోటీదారుల నిర్వహణ రాష్ట్ర ఇన్‌చార్జి లక్ష్మి అన్నారు. మిస్ వరల్డ్-2025 పోటీల నిర్వహణలో భాగంగా ప్రపంచ సుందరీమణులు ఈ నెల 15న భూదాన్‌పోచంపల్లిని సందర్శించనున్నారు. పట్టణంలోని రూరల్ టూరిజం సెంటర్‌లో ప్రపంచ సుందరీమణులకు తగిన ఏర్పాట్లపై స్థానిక అధికారులతో చర్చించేందుకు శనవారం మిస్ వరల్డ్ పోటీల సుందరీమణుల పోచంపల్లి సందర్శన కార్యక్రమం ఇన్‌చార్జి, రాష్ట్ర వీవర్స్ హౌసింగ్ కార్పొరేషన్ అధికారి లక్ష్మి, కో ఆర్డినేటర్ ఉపేందర్ భూదాన్‌పోచంపల్లిలోని రూరల్ టూరిజం సెంటర్‌ను సందర్శించారు. ప్రపంచ సుందరీమణులకు భూదాన్‌పోచంపల్లి చేనేత టైఅండ్ డై ఇక్కత్ పట్టు చీర ప్రాముఖ్యతను, విశిష్టతను వివరించేందుకు డిస్‌ప్లే నిర్వహించనున్నారు. యారన్ నుంచి సిల్కు చీర తయారీపై వివరించనున్నారు.

శాంతి భద్రతల పరిరక్షణకే తనిఖీలు: ఏసీపీ

భువనగిరి టౌన్, మే 3 (ఆంధ్రజ్యోతి) : అసాంఘిక శక్తులను గుర్తించి అదుపులోకి తీసుకొని శాంతి భద్రతలను పరిరక్షించేందుకే కమ్యూనిటీ ఇంట్రాక్ట్ నిర్వహిస్తున్నట్లు ఏసీపీ కె రాహుల్‌రెడ్డి అన్నారు. శనివారం రాత్రి భువనగిరి పట్టణం హనుమన్‌వాడలో నిర్వహించిన కమ్యూనిటి ఇంట్రాక్ట్‌ను ఆయన పర్యవేక్షించి మాట్లాడారు. అనుమానాస్పద వ్యక్తుల కదలికలను ప్రజలు ఎప్పటికప్పుడు పోలీసులకు తెలపాలని సూచించారు. లైసెన్స్, నెంబర్ ప్లేట్ లేకుండా వాహనాలను కలిగి ఉన్నా, నడిపించినా చర్యలు తప్పవని అన్నారు. ఈ సందర్భంగా సరైన గుర్తింపు పత్రాలు లేని 27 బైక్‌లు, ఒక ఆటో స్వాధీనం చేసుకున్నారు. రెండు అక్రమ మద్యం, ఒక గుట్కా విక్రయాల కేసులను నమోదు చేశారు. ముగ్గురు అనుమానితులను, నలుగురు రౌడీ షీటర్లను అదుపులోకి తీసుకున్నారు. ఎస్‌వోటీ అడిషనల్ డీసీపీ ఎన్ నర్సింహారెడ్డి, పట్టణ ఇన్స్‌పెక్టర్ కె సురేష్‌కుమార్, ఎస్ఐలు కుమారస్వామి, లక్ష్మీనారాయణతో పాటు పలువురు పోలీసు అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

పోచంపల్లి పట్టు వస్త్రాలతో భద్రకాళి అమ్మవారు



భూదాన్‌పోచంపల్లి, మే 3 (ఆంధ్రజ్యోతి) : వరంగల్‌లోని ప్రసిద్ధ శ్రీ భద్రకాళి భద్రేశ్వరస్వామి దేవాలయం బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి భక్తులకు పోచంపల్లి ఇక్కత్ పట్టు వస్త్రాలంకరణలో అమ్మవారు దర్శనమిచ్చారు. ఈనెల 2న నిర్వహించిన స్వామి కల్యాణోత్సవానికి భూదాన్‌పోచంపల్లికి చెందిన చేనేత కళాకారులు రుద్ర శ్రీశైలం, రుద్ర చెన్నకేశవులు, రుద్ర పాండురంగశాస్త్రి కుటుంబ సభ్యులు మగ్గాలపై పోచంపల్లి ఇక్కత్ పట్టు వస్త్రాలను తయారు చేసి ఈవో కే.శేషుభారతికి అందజేశారు. కాగా, శుక్రవారం భద్రకాళి అమ్మవారు పోచంపల్లి పట్టు వస్త్రాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

ఈ నెల 5 నుంచి 'రైతు ముగింట్లో శాస్త్రవేత్తలు'

(1వ పేజీ తరువాయి)

సాంకేతిక ఆధారంగా రైతుల అభివృద్ధికి ఈ అవగాహన కార్యక్రమం దోహదం చేస్తుందని అధికార వర్గాలు భావిస్తున్నాయి. వానాకాలం సాగుకు రైతులను సమాయత్తం చేసేందుకు మెరుగైన సాగు పద్ధతులపై అవగాహన కల్పించేందుకు శాస్త్రవేత్తలు, వ్యవసాయశాఖ అధికారులు గ్రామాలకు తరలనున్నారు. ఈ కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రాలతో పాటు ఏరువాక కేంద్రాలు, వ్యవసాయ పరిశోధన సంస్థలు, వ్యవసాయ అనుబంధ అధికారులు పాల్గొంటారు. రైతులు ఎదుర్కొంటున్న అనేక సవాళ్లకు, వ్యవసాయంలో రోజురోజుకూ పెరుగుతున్న పెట్టుబడులను తగ్గించుకోవడానికి అవసరమైన సూచనలు, సలహాలు ఇవ్వనున్నారు. ఏటా వ్యవసాయశాఖ ఆయా సీజన్‌ల్లో ఇప్పటికే 'పల్లెబాట' కార్యక్రమం నిర్వహిస్తోంది. ఇందులో కేవలం వ్యవసాయశాఖ అధికారులు గ్రామాలకు వెళ్లి పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించేవారు. అయితే 'రైతు ముగింట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమంలో వ్యవసాయశాఖ అధికారులతోపాటు శాస్త్రవేత్తలు రైతుల వద్దకు వెళ్లేందుకు గ్రామాల బాట పట్టనున్నారు.

రైతులు సద్వినియోగం చేసుకోవాలి

ప్రభుత్వం రైతుల సంక్షేమం, అభివృద్ధి కోసం 'రైతుల ముగింట్లోకి శాస్త్రవేత్తలు' కార్యక్రమాన్ని నిర్వహించనుంది. ఈ అవగాహన కార్యక్రమంలో శాస్త్రవేత్తలతో పాటు వ్యవసాయశాఖ అధికారులు, ఉద్యోగులు కూడా పాల్గొంటారు. ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయడంతో పాటు సద్వినియోగం చేసుకోవాలి. వచ్చే వానాకాలం సీజన్‌కు సంబంధించి ఈ అవగాహన కార్యక్రమంలో పలు విషయాలను రైతులకు వివరిస్తారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని రైతులు తప్పనిసరిగా సదస్సులకు హాజరు కావాలి. ఈ సదస్సులు రైతులు ఆర్థికాభివృద్ధి సాధించేందుకు ఉపయోగపడుతుంది.

పి.శ్రవణ్ కుమార్, జేడీఏ నల్లగొండ

రైతు సందేహాల నివృత్తికి సదస్సులు

యాదగిరిగుట్ట రూరల్ : సాగులో రైతుల్లో నెలకొన్న సందేహాలను నివృత్తి చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని యాదగిరిగుట్ట ఏడీఏ శాంతి నిర్మల తెలిపారు. ఈ నెల 5నుంచి జూన్ 13వరకు 'రైతు ముంగిట్లో శాస్త్రవేతలు' అవగహన సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు. శనివారం యాదగిరిగుట్టలో ఆమె విలేకరులతో మాట్లాడారు. ఆలేరు డివిజన్‌లో భాగంగా బొమ్మలరామారం, తుర్కపల్లి మండలాల్లో వ్యవసాయ విశ్వ విద్యాలయం నుంచి శాస్త్రవేతలు గ్రామాల్లో రైతులకు అవగాహ న సదస్సులు నిర్వహిస్తారన్నారు. సాగునీటిని ఆదా చేస్తూ భవితరాలకు అందించాలని, పంటలమార్పిడి పాటించి సుస్థిర ఆదాయాన్ని పొందుతూ, మొక్కల పెంపకం చేపట్టి, పర్యావరణాన్ని కాపాడాలనే అంశాలపై రైతులకు అవగాహన కల్పించనున్నట్లు వివరించారు. అలాగే కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందడానికి ప్రతి రైతు ఆధార్ తరహాలో యునికోడ్ ఫార్మర్ రిజిస్ట్రీ చేసుకోవాలన్నారు. ప్రతీ రైతు ఆధార్‌కార్డు, పట్టాపాస్‌పుస్తకం, మొబైల్ నంబర్ తీసుకొని వ్యవసాయ కేంద్రాలకు వచ్చి నమోదు చేసుకోవాలన్నారు. రైతులకు 11 అంకెల విశిష్ట సంఖ్య కేటాయిస్తారని, ఇప్పటికే రిజిస్ట్రీపై ఏఈవోలకు అవగాహన కల్పించామని, ఈ నెల 5నుంచి రైతులు నమోదు చేసుకోవాలన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి



బొక్కమంతలపహాడ్‌లో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న డీఎస్పీ అధ్యక్షుడు విశారదన్

నిడమనూరు, మే 3 (ఆంధ్రజ్యో తి): ప్రియుడి చే తిలో మోసపోయిన దళిత యువతి దర్మారపు మల్లీశ్వరి ఆత్మహత్యకు కారణమైన నిందితులను కఠినంగా శిక్షించాలని ధర్మ సమాజ్ పార్టీ వ్య వస్థాపక అధ్యక్షుడు విశారదన్ మహరాజ్ డిమాండ్ చేశారు. మండలంలోని బొక్కమంతలపహడ్ గ్రామంలో మల్లీశ్వరి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం రాత్రి డీఎస్పీ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. మల్లీశ్వరి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మల్లీశ్వరిది అగ్ర కుల దురహంకార హత్యేనని ఆయన ఆరోపించారు. ప్రేమ పేరుతో మోసపోయిందని వాపోయారు. ఆమె మరణానికి కారణమైన నిందుతులపై హత్యానేరం కింద కేసులు నమోదు చేసి శిక్షలు పడేలా చేయాలని డిమాండ్ చేశారు. మల్లీశ్వరి కుటుంబానికి రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వడంతో పాటు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. స్థానిక ప్రజాప్రతినిధులు, ఎంపీ, ఎమ్మెల్యేలు మల్లీశ్వరి కుటుంబాన్ని పరామర్శించి న్యాయం చేయాలన్నారు. మల్లీశ్వరి కుటుంబానికి న్యాయం జరిగేవరకు ఆందోళనలు చేస్తామని, తమ పార్టీ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు దుర్గాప్రసాద్, రాంబాబు, జిల్లా రమేష్, గ్రామస్థులు పాల్గొన్నారు.

రెండో రోజు సినిమా షూటింగ్

భువనగిరి టౌన్, మే 3 (ఆంధ్రజ్యోతి): బలగం ఫేమ్ ప్రియదర్శిని హీరోగా నటిస్తున్న సినిమా షూటింగ్ రెండవ రోజు శనివారం భువనగిరిలోని పలు బస్తీల్లో రోజంతా కొనసాగింది. ఓ ప్రముఖ ఆర్ట్ క్రియేషన్స్ సంస్థ నిర్మిస్తున్న ఈ సినిమా కామెడీ, ఎంటర్‌టైన్‌మెంట్‌గా ఉంటుందని తెలుస్తున్నది. నల్లగొండకు చెందిన విజయేందర్ సొట్ట దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో నల్లగొండ జిల్లా అడవిదేవులపల్లికి చెందిన మహేష్ చింతల ఓ ప్రధాన పాత్రలో నటిస్తున్నాడు.

అకాలవర్షంతో పంట నష్టం

● తీవ్రంగా నష్టపోయిన దొండ రైతులు



మల్లప్పరాజుపల్లిలో వడగండ్ల వానకు రాలిన దొండకాయులను చూపిస్తున్న రైతులు

నాంపల్లి, మే 3(ఆంధ్రజ్యోతి): నాంపల్లి మండలంలో శుక్రవారం కురిసిన వడగండ్ల వర్షానికి దొండ రైతులతో పాటు వరి రైతులు తీవ్రంగా నష్టపోయారు. మండలంలోని మల్లపురాజుపల్లి, పసునూరు, తుంగపాటిగౌరారం వడ్డేపల్లి, ముష్టిపల్లి గ్రామాల్లో దొండ రైతులు తీవ్రంగా నష్టపోయారు. నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు వేడుకుంటున్నారు. శనివారం వడగండ్ల వానకు నష్టపోయిన పంటలను శనివారం మునుగోడు నియోజకవర్గ హార్టికల్చర్ ఆఫీసర్ రావుల విద్యాసాగర్ పరిశీలించారు. ఈ సందర్భంగా దొండ తోటలను పరిశీలించారు. వడగండ్ల వాన, భారీ వర్షం కారణంగా దొండకాయ తోటలు సుమారు 300 ఎకరాలు, నిమ్మ తోటలు 30, మామిడి 10, దోస 10, మునగ 5 ఎకరాలు ఇతర కూరగాయలు సుమారు 10, వరి 20 ఎకరాల మేర నష్టం నష్టం జరిగిందని ప్రాథమిక అంచనా వేశారు. ఈ మేరకు జిల్లా కార్యాలయానికి నివేదిక పంపుతున్నట్లు ఆయన తెలిపారు. ఈ నష్టపోయిన రైతులు తమ పాస్‌పుస్తకం, ఏ సర్వే నెంబర్‌లో, ఏ పంట ఎంత నష్ట పోయారో వాటి వివరాలు ఏఈవోల దగ్గర నమోదు చేసుకోవాలని తెలిపారు. ఈ క్షేత్ర పర్యటన కార్యక్రమంలో తుంగపాటి గౌరారం క్లస్టర్ ఏఈవో ఎం.జగన్, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

యాదగిరిగుట్ట సీఐగా భాస్కర్

యాదగిరిగుట్ట రూరల్, మే 3, (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట సీఐ(ఎస్‌హెచ్‌వో)గా బి.భాస్కర్, రూరల్ సీఐగా మాదాను శంకర్‌గౌడ్‌ను నియమిస్తూ రాచకొండ సీపీ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. అంతకు ముందు విధులు నిర్వహించిన మేకల రమేష్ భువనగిరి ఎస్‌హెచ్‌వోగా, గుట్ట రూరల్ సీఐగా విధులు నిర్వహించిన కొండల్‌రావును ఆలేరు ఎస్‌హెచ్‌వోగా బదిలీ చేసినట్లు తెలిసింది. ఆయన స్థానంలో గతంలో సీఐగా విధులు నిర్వహించిన మాదాని శంకర్‌గౌడ్‌ను రూరల్ సీఐగా నియమించినట్లు తెలిసింది.

6 నుంచి వేసవి ఉచిత క్రికెట్ శిక్షణ శిబిరాలు

నల్లగొండ స్పోర్ట్స్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాలోని సూర్యాపేట, భువనగిరి, నకిరేకల్, నల్లగొండ ప్రాంతాల్లో వేసవి ఉచిత క్రికెట్ శిక్షణ శిబిరాలను ఈ నెల 6వ తేదీన ప్రారంభిస్తున్నట్లు క్రికెట్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి అమీనోద్దీన్ ఒక ప్రకటనలో తెలిపారు. 8 ఏళ్ల నుంచి 19 ఏళ్ల బాల, బాలికలు శిక్షణకు అర్హులని, ఇతర వివరాలకు 9885717996 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

కేతేపల్లి తహసీల్దార్‌గా సత్తార్

కేతేపల్లి, మే 3(ఆంధ్రజ్యోతి): కేతేపల్లి తహసీల్దార్ ఎస్.మధుసూదన్‌రెడ్డి బదిలీ అయ్యారు. ఆయన సుమారు రెండున్నరేళ్ల ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేశారు. మధుసూదన్‌రెడ్డి దేవరకొండకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో డీటీగా బాధ్యతలు నిర్వహిస్తున్న సత్తార్‌ను పూర్తి అదనపు బాధ్యతలతో తహసీల్దార్‌గా కలెక్టర్ నియమించారు. మధుసూదన్‌రెడ్డి శనివారం ఇక్కడ నుంచి రిలీవ్ అయ్యారు.

ఉపాధి చట్టాన్ని పరిరక్షించుకోవాలి


ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న నారి అయిలయ్య

కేతేపల్లి, మే 3(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ చట్టాన్ని పరిరక్షించుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి నారి అయిలయ్య అన్నారు. మండలంలోని ఇనుపాముల గ్రామంలో శనివారం ఉపాధి పని ప్రదేశంలో కూలీలతో మాట్లాడారు. ఉపాధి హామీ పనిదినాల కుదింపును వెనక్కు తీసుకోవాలని, పోడు భూములకు హక్కు పత్రాలు ఇవ్వాలని, రైతాంగం పండించి పంటలకు కనీస మద్దతు ధరల చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేబర్ కోడ్లను రద్దు చేసి కనీస వేతనాలను అమలు చేయాలని అన్నారు. ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా 14 రకాల సరుకులు అందించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ నెల 20న దేశవ్యాప్తంగా నిర్వహించే హర్తాల్‌లో కూలీలు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బి.చినవెంకులు, జిల్లా సహాయ కార్యదర్శి సీహెచ్.లూర్దుమారయ్య, నాయకులు కె.యల్లయ్య, టి.మణెమ్మ, బి.లాలయ్య, ఆర్.సుకన్య, బి.వెంకటమ్మ, పి.ఎల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

పిల్లలను క్రీడల వైపు మళ్లించాలి

కేతేపల్లి, మే 3(ఆంధ్రజ్యోతి): చిన్న పిల్లలు వేసవిలో సెల్‌ఫోన్ బందీలు కాకుండా ఉండేందుకు వారిని అవుట్‌డోర్, ఇన్‌డోర్ క్రీడల వైపునకు మళ్లించాలని కాంగ్రెస్ పార్టీ మండల నాయకుడు బడుగుల నరేందర్‌యాదవ్ అన్నారు. మండలంలోని భీమారం సెంటినరీ బాప్టిస్టు చర్చిలో శనివారం చిన్న పిల్లల కోసం ప్రారంభించిన వేసవిలో ఆడవిడుపు కోసం నిర్వహించిన కార్యక్రమానికి ఆయన హాజరై పిల్లలకు గిఫ్టుబాక్సులు, క్యారం బోర్డులు, షటిల్ బ్యాట్, బాల్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ పిల్లలు సెల్‌ఫోన్‌లకు బానిసలు కాకుండా అవుట్‌డోర్, ఇన్‌డోర్ క్రీడల్లో భాగస్వాములను చేయాలని సూచించారు. క్రీడల్లో పాల్గొనడం వల్ల మానసికంగా, శారీరకంగా ఎదగడమే కాక ఇతరులతో స్నేహపూర్వకంగా వ్యవహరించడం అలవడుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు సుక్క వినయ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి, మాదకద్రవ్యాలపై అప్రమత్తంగా ఉండాలి


వంగమర్తిలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న సీఐ కొండల్‌రెడ్డి

శాలిగౌరారం, మే 3(ఆంధ్రజ్యోతి): యువతీ, యువకులు, గంజాయి, మాదక ద్రవ్యాలపై అప్రమత్తంగా ఉండాలని శాలిగౌరారం సీఐ కె.కొండల్ రెడ్డి అన్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు మండలం వంగమర్తి గ్రామంలో పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో గంజాయి, డ్రగ్స్ రోడ్డు ప్రమాదాల నివారణ, చేతబడి, మూఢనమ్మకాలపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. నేటి యువత గంజాయి, మాదకద్రవ్యాలకు బానిసలుగా మారి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని అన్నారు. ప్రతి ఒక్కరూ హెల్మెంట్ ధరించి రోడ్డు ప్రమాదాలకు గురికాకుండా ప్రయాణించాలన్నారు. మూఢనమ్మకాలను, చేతబడి అనేవి అపోహలు మాత్రమేనన్నారు. గ్రామ పోలీస్ వ్యవస్థను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ డి.సైదులు, గ్రామపోలీస్ అధికారి లింగయ్య, పోలీస్ సిబ్బంది నాగయ్య, రవినాయక్, సునీల్, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం


పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో పాల్గొన్న అప్పటి విద్యార్థులు

శాలిగౌరారం, మే 3(ఆంధ్రజ్యోతి): శాలిగౌరారంలోని విజ్ఞానజ్యోతి హైస్కూల్ 2008-09 పదవ తరగతి బ్యాచ్ విద్యార్థులు శనివారం స్థానిక ఫంక్షన్‌హాల్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. స్కూల్ నుంచి విడిపోయి 16 సంవత్సరాల తర్వాత ఒకరినొకరు ఒకే వేదిక మీద కలుసుకోవడంతో వారి ఆనందానికి అవధులు లేవు. ఒకరినొకరు ఆప్యాయతగా పలకరించుకొని తమ మనోభావాలు పంచుకున్నారు. పాఠశాలలో చదువుకున్న రోజులను గుర్తు తెచ్చుకున్నారు. అనంతరం తమకు పాఠాలు బోధించిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించి జ్ఞాపికలు అందజేశారు.

కార్యక్రమంలో అప్పటి హెచ్ఎం, కరస్పాండెంట్ బుడిగె శ్రీనివాసులు, ఉపాధ్యాయులు పడాల అంతయ్య, కొడవకంటి సుబ్రహ్మణ్యంశర్మ, రావుల వీరయ్య, అబ్దుల్ సలాం, చెవుగోని సత్యనారాయణ, బెల్లంకొండ స్వామి, భూపతి సైదులు, వేముల సోమయ్య, మద్ది అరుణ, రజిత, డెంకల వెంకటమ్మ, పూర్వ విద్యార్థులు రావుల శంకర్, అదే నాగరాజు, అనుముల నాగరాజు, మహేష్, నాగరాజు, చరణ్ తేజ, శంకర్, బీరప్ప, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా నీళ్ల ట్యాంకు

- ట్యాంకుతో పాటు పక్కన గృహాలకు పొంచి ఉన్న ప్రమాదం
- ఏ క్షణాన కూలుతుందోనని భయం
- నిరంతరంగా పైనుంచి వస్తున్న నీరు
- ట్యాంకు పిల్లర్లతో పాటు దెబ్బతింటున్న గృహాల పునాదులు


బాలిశెట్టిగూడెంలో ప్రమాదకరంగా ఉన్న వాటర్ ట్యాంకు

నివాసగృహాల మధ్య నిర్మించిన మంచినీటి ట్యాంకు ప్రమాదకరంగా మారింది. ట్యాంకు నుంచి నీరు లీకేజీ అవుతుండటంతో అది శిథిలావస్థకు చేరుకుంది. ట్యాంకు నిండినప్పుడు పైనుంచి వస్తున్న నీరు ప్రత్యేక పైపులైను వేసి మురుగుకాల్వలకు అనుసంధానం చేయాల్సి ఉంది. కానీ ఆ నీరంతా దిగువకు చేరి ట్యాంకు పిల్లర్లను వద్ద నిల్వ ఉంటుంది. దీంతో పిల్లర్లు దెబ్బతింటుండటంతో చుట్టుపక్కల ఉన్న గృహాలు దెబ్బతినే పరిస్థితి నెలకొంది. ఇదీ శాలిగౌరారం గ్రామ పంచాయతీ పరిధిలోని బాలిశెట్టి గూడెంలో రక్షిత మంచినీటి కృష్ణా జలాల ట్యాంకు పరిస్థితి.

- (ఆంధ్రజ్యోతి,శాలిగౌరారం)

శాలిగౌరారం గ్రామ పంచాయతీ పరిధిలోని బాలిశెట్టి గూడెంలో రక్షిత మంచినీటి కృష్ణా జలాల ట్యాంకు పరిస్థితి. నిర్మించారు. ఈ ట్యాంకు నివాసగృహాల మధ్యలోనే నిర్మించడంతో చుట్టుపక్కల ఇళ్లవారికి ప్రమాదం పొంచి ఉంది. ట్యాంకులోకి నీరు నిండినప్పుడు కిందికి పడటంతో పాటు లీకేజీ అవుతుంది. ట్యాంకు పైనుంచి వస్తున్న నీరు పక్కనే ఉన్న గృహాల మీద పడటంతో ప్రమాదకరంగా మారాయి. ట్యాంకు నుంచి వచ్చే నీటితో పక్కనే ఉన్న గృహాల పునాదులు నీటితో నాని కూలిపోయే పరిస్థితులు పొంచి ఉన్నాయి. ట్యాంకు పైనుంచి వచ్చే నీటిని డ్రైనేజీ కాల్వలో కలపకుండా వదిలివేశారు. పైనుంచి వస్తున్న నీరంతా పిల్లర్ల కింద పడటంతో పాటు ఇళ్ల మధ్య గృహాల పునాదులు కూడా దెబ్బతింటున్నాయి. నీటితో నాని ట్యాంకు కూడా ఏ క్షణం అయినా కూలిపోయే పరిస్థితి ఉంది. ఈ ట్యాంకు ఏ క్షణాన కూలిపోతే చుట్టుపక్కల ఉన్న గృహాలకు పెనుప్రమాదం పొంచి ఉంది. ఈ ట్యాంక్ నుంచి నీరు లీకేజీ కాకుండా కింద పడి ట్యాంకు పిల్లర్లతో పాటు ఇళ్ల గృహాలు దెబ్బతినకుండా పైనుంచి వచ్చే నీటిని డ్రైనేజీలోకి సపరేట్ పైపులను వేసి తరలించాల్సి ఉంది. ఈ ఓవర్ హెడ్ ట్యాంకు ఏ క్షణాన కూలిపోయి ఇళ్ల మీద పడే ప్రమాదం ఉంది.

బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నాం



మా ఇంటి గోడ పునాదికి ఆనుకొని మంచి నీటి ఓవర్ హెడ్ ట్యాంకును నిర్మించారు. ట్యాంకులోకి నీరు పూర్తిగా నిండినప్పుడు పైనుంచి వచ్చే నీటి నీటికి పైపులను వేసి మురుగుకాల్వలో కలపకుండా వదిలివేశారు. దీంతో ట్యాంకు నీరంతా వచ్చి ట్యాంకు కింద పిల్లర్లతో పాటు మా ఇంటి గోడ పునాదులు కూడా నీటితో నాని దెబ్బతింటున్నాయి. కింద నీటి జాలుతో ఏ క్షణంలో ట్యాంకు కూలి మా ఇంటి మీద పడుతుందోనని ప్రతీరోజు నిద్రలేని రాత్రితో భయభయంతో గడుపుతున్నాం. అధికారులు ఇక్కడికి వచ్చి వెళ్తున్నారు తప్ప పరిష్కార మార్గాలు చూపడం లేదు.

- కోనేటి జ్యోతి, బాలిశెట్టిగూడెం

డ్రైనేజీ పైపునకు రంధ్రం

- ఆదమరిస్తే తప్పదు గాయం..!
- చెర్వుగట్టులో పార్వతీ అమ్మవారి ఆలయం మలుపు వద్ద పగిలిన డ్రైనేజీ పైప్
- రోజులు గడుస్తున్నా పట్టించుకోని అధికారులు


చెర్వుగట్టులో పార్వతీ అమ్మవారి ఆలయ మలుపు వద్ద ధ్వంసమైన డ్రైనేజీ పైపు

నార్కట్‌పల్లి, మే 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెర్వుగట్టులో పార్వతీ మాత ఆలయం వద్దకు వెళ్లే మూల మలుపు వద్ద డ్రైనేజీ పైపు పగిలి ప్రమాదం పొంచి ఉంది. సరిగ్గా మూల మలుపు వద్దే పగిలిన ఈ డ్రైనేజీ పైప్ పై నుంచి వెళ్లే వాహనాలు కుదుపునకు గురవుతున్నాయి. గ్రామస్థులు కాకుండా చెర్వుగట్టు క్షేత్రానికి సందర్శనకు వచ్చే ద్విచక్ర వాహనదారులు అకస్మాత్తుగా పగిలిన డ్రైనేజీ పైప్‌పై వెళ్లి కిందపడి గాయాలపాలవుతున్నారు. జనవరి నెలలో జరిగిన స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల సమయంలో కూడా డ్రైనేజీ పైప్‌లైను ధ్వంసమై ప్రమాదకరంగా మారడంతో పత్రికల్లో వచ్చేంత వరకు పంచాయతీ అధికారులు పట్టించుకోలేదు. పైగా తాత్కాలిక మరమ్మతులు చేసి చేతులు దులుపుకున్నారు. జాతర తర్వాత సమస్యకు శాశ్వత పరిష్కారంగా పగిలిన పైప్ స్థానంలో కొత్త పైప్ వేస్తామన్నారు. జాతర పూర్తయి దాదాపు 4 నెలలు గడుస్తున్నా సమస్యకు శాశ్వత పరిష్కారం చూపకపోవడంతో డ్రైనేజీ పైప్ పై మళ్లీ రంధ్రం ఏర్పడి ప్రమాదం పొంచి ఉంది. గ్రామస్థులకు తెలియడంతో ఈ మూల మలుపు వద్దకు వచ్చేసరికి జాగ్రత్త పడుతున్నారు. కానీ కొత్తగా వచ్చే భక్తులకు ఇది తెలియక ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత పంచాయతీ అధికారులు స్పందించి సమస్యకు శాశ్వత పరిష్కారం చేయాలని బాధితులు కోరుతున్నారు.

కూలీలకు 200 రోజులు పని కల్పించాలి


పుల్లెంల గ్రామంలో ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న నర్సింహ

చండూరురూరల్, మే 3(ఆంధ్రజ్యోతి): జాతీయ ఉపాధి హామీ కూలీలకు 200 రోజులు పనిదినాలు, రోజు వారి వేతనం రూ.700 ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బొలుగూరి నర్సింహ అన్నారు. మండల పరిధిలోని పుల్లెంల గ్రామంలో శనివారం గ్రామీణ ఉపాధి హామీ కూలీలను ఆయన క్షేత్రస్థాయిలో సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఈ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేయడానికి కుట్ర చేస్తుందని విమర్శించారు. ఉపాధి హామీ పనుల్లో భాగంగా పనుల దగ్గర కనీస సౌకర్యాలు కల్పించాలని, మంచినీరు, మెడికల్ కిట్టు, పార, గడ్డపార వంటి కనీస అవసరాలను ఏర్పాటు చేయాలని సూచించారు. కొత్తగా రేషన్‌కార్డులు, జాబ్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి వెంటనే ఇవ్వాలని, జాబ్ కార్డుతో సంబంధం లేకుండా ఆత్మీయ రైతు భరోసా ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రతి నెలా ఫీల్ అసిస్టెంట్లకు వేతనాలు చెల్లించాలని, నిరుపేద వ్యవసాయ కూలీలకు ఇల్లు స్థలాలు ఇచ్చి ఇళ్ల నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు ఎండి జానీ మియా, చెడుబుద్ధి ఊషయ్య, మండల అధ్యక్ష, కార్యదర్శులు బాతరాజు సైదులు, ఇరిగి సంజీవ, వ్యవసాయ కూలీలు గండు సత్తయ్య, దుబ్బాక వెంకన్న, పాక లింగయ్య, మొగుదాల బిక్షపతి కనకమ్మ, అంజమ్మ, పద్మ, లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

● చండూరు సీఐ ఆదిరెడ్డి


పర్వతగిరిలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న సీఐ ఆదిరెడ్డి

కనగల్, మే 2 (ఆంధ్రజ్యోతి): చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని చండూరు సీఐ ఆదిరెడ్డి అన్నారు. మండలంలోని పర్వతగిరి గ్రామంలో శనివారం రాత్రి మిషన్ త్రిపులార్‌లో భాగంగా పోలీస్ కళాజాతను నిర్వహించారు. ఇందులో భాగంగా కళాజాత బృందం సభ్యులు తమ ఆటపాటల తో చట్టాల గురించి వివరించారు. ఈ సందర్భంగా సీఐ ఆదిరెడ్డి మాట్లాడుతూ సామాజిక దురాచారాలైన బాల్యవివాహాలు, మూఢనమ్మకాలను రూపుమాపాలన్నారు. బాలల చట్టాలను, మహిళల రక్షణ చట్టాలను వివరించారు. వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటించాలని సూచించారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి తమ భవిష్యత్తును చక్కగా మలుచుకోవాలన్నారు. గ్రామాల్లో అనుమానాస్పద రీతిలో అపరిచితులు సంచరిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఆయన సూచించారు. నేరాల నియంత్రణకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్తు మనుగడలో యువత పాత్ర కీలకం


మునుగోడులో ఏఐవైఎఫ్ జెండా ఎగురవేస్తున్న వెంకటేశ్వర్లు

మునుగోడు, మే 3 (ఆంధ్రజ్యోతి): దేశ భవిష్యత్తు మనుగడలో యువత పాత్ర కీలకమని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) జిల్లా ప్రధాన కార్యదర్శి తీర్పారి వెంకటేశ్వర్లు అన్నారు. ఏఐవైఎఫ్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలో శనివారం ఆయన జెండాను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పించి వారి హక్కుల సాధన కోసం తమ సమాఖ్య నిరంతరం ఉద్యమిస్తుందని అన్నారు. ప్రగతి శీల, అభ్యుదయ భావాలు, నైతిక విలువలు, దేశభక్తి, లౌకిక ప్రజాస్వామిక ఆలోచనలను యువత కలిగి ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా కౌన్సిల్ సభ్యుడు పులకరం ఆంజనేయులు, బొల్గూరి వంశీకృష్ణ, ఈదులకంటి కైలాసం, శ్రీనివాస్, కోటి, శేఖర్, తాజ్, శంకర్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

లారీ డ్రైవర్ కుటుంబసభ్యులకు ఆర్థికసాయం


ఆర్థికసాయం అందజేస్తున్న లారీ ఓనర్స్, డ్రైవర్స్ అసోసియేషన్ సభ్యులు

చిట్యాలరూరల్, మే 3 (ఆంధ్రజ్యోతి): చిట్యాల మండలం బోయగుబ్బ గ్రామ పరిధిలో గల మొగిలి దొరికి చెందిన మృతుడు లారీ ఓనర్, డ్రైవర్‌గా పనిచేస్తున్న బొమ్మగోని రవీందర్‌గౌడ్ ఈ నెల 1వ తేదీన గుండెపోటుతో మృతి చెందాడు. స్థానిక జైశ్రీమన్నారాయణ లారీ ఓనర్స్ డ్రైవర్స్ అసోసియేషన్ సభ్యులు మృతుని చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మృతుని కుటుంబసభ్యులకు పరామర్శించి రూ.1.10 లక్షల ఆర్థికసాయం అందజేశారు. మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య మృతుని చిత్రపటానికి నివాళులర్పించి కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో గుత్తా శ్రీనివాస్‌రెడ్డి, కల్లూరి మల్లారెడ్డి, బోయపల్లి శ్రీనివాస్, జనగాం నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

సరైన పత్రాలు చూపించి వాహనాలు తీసుకెళ్లాలి

నల్లగొండ, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వివిధ పోలీస్‌స్టేషన్ల పరిధిలో పలు కేసుల్లో పట్టుపడిన వాహనాల యజమానులు సరైన పత్రాలను చూపించి ఆ వాహనాలను తీసుకెళ్లాలని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ కేసుల్లో 73 ద్విచక్రవాహనాలు జిల్లా పోలీస్ శిక్షణా కేంద్రానికి తరలించినట్లు తెలిపారు. సరైన పత్రాలు చూపించి తీసుకువెళ్లాలని, లేనిచో 6నెలల కాల వ్యవధిలో ప్రభుత్వ నిబంధనల ప్రకారం బహిరంగ వేలం వేయనున్నట్లు పేర్కొన్నారు. ఇతర వివరాలకు మోటార్ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్ సూరప్పనాయుడు 8712670170 నెంబర్‌ను సంప్రదించాలని ఆయన కోరారు.

పార్టీని బలోపేతం చేయాలి


శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న ఎంపీ రఘునందన్

నార్కట్‌పల్లి, మే 3 (ఆంధ్రజ్యోతి): పార్టీని బలోపేతం చేయాలని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు సూచించారు. బీజేపీ నార్కట్‌పల్లి మండల నూతన అధ్యక్షుడు మేడబోయిన శ్రీనివాస్, జిల్లా కౌన్సిల్ సభ్యుడు నడింపల్లి శ్రవణ్‌కుమార్‌లను మెదక్ ఎంపీ రఘునందన్‌రావు అభినందించారు. నల్లగొండలోని పార్టీ కార్యాలయంలో జరిగే సమావేశానికి వెళ్తున్న రఘునందన్‌కు శనివారం మార్గమధ్యలో నార్కట్‌పల్లి వద్ద బీజేపీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. ఈ సమయంలో కొత్తగా ఎన్నికైన మేడబోయిన శ్రీనివాస్, నడింపల్లి శ్రవణ్‌లు ఎంపీని పరిచయం చేసుకోగా వారిని ఆయన శాలువాతో సత్కరించి అభినందించారు. పార్టీ బలోపేతం కోసం పాటుపడాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు నకిరేకంటి మొగులయ్య, మునుకుంట్ల గణేష్, కొర్వి శంకర్, పాల్వాయి భాస్కర్‌రావు, వడ్డేగోని రామలింగం, ఏర్పుల పరమేష్, నోముల నాగరాజు, శ్రీకాంత్, శ్రీనివాస్, పార్థసారధి, రమేష్, సంపత్, తిరుమలేష్, శివ, సాయి, గణేష్ తదితరులు పాల్గొన్నారు.


ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక

పారదర్శకంగా నిర్వహించాలి


సమావేశంలో మాట్లాడుతున్న సురిగి చలపతి

మునుగోడు రూరల్, మే 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకంలో ఎలాంటి అవకతవకలు జరగకుండా పారదర్శకంగా నిరుపేదలను ఎంపిక చేయాలని సీపీఐ నాయకులు సురిగి చలపతి, ఈదులకంటి కైలాస్ డిమాండ్ చేశారు. మండలంలోని చీకటిమామిడి గ్రామంలో నిర్వహించిన సమావేశానికి వారు హాజరై మాట్లాడారు. ఇందిరమ్మ పథకంలో ఇళ్లు, ట్రాక్టర్లు, కార్లు కలిగిన వారికి కాకుండా నిరుపేదలను ఎంపిక చేయాలని కోరారు. నిబంధనలు తొలగించి బేస్‌మెంట్లు, రేకుల ఇళ్లు నిర్మించుకున్న వారికి పునర్నిర్మాణం చేసుకోవడానికి అవకాశం ఇవ్వాలని కోరారు. మేడే సందర్భంగా జెండా ఆవిష్కరించారు. అనంతరం నూతన గ్రామకమిటీని ఎన్నుకున్నారు. సీపీఐ గ్రామశాఖ నూతన కార్యదర్శిగా పుల్కరం ఆంజనేయులు, సహాయ కార్యదర్శిగా ఏర్కొండ యాదయ్య, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. సమావేశంలో నాయకులు ఏర్కొండ యాదయ్య, కార్యవర్గ సభ్యులుగా ఏర్కొండ నాగేష్, చింతల రమేష్, రాకేష్, చింతల వెంకటయ్య, ముది చంద్రయ్య, పాలకూరి కాటమయ్య, పుల్కరం రాములు, సైదులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పాఠశాలలో సన్మానం



విద్యార్థులను సన్మానిస్తున్న పీఏసీఎస్ వైస్‌చైర్మన్ నాగరాజు

చిట్యాలరూరల్, మే 3 (ఆంధ్రజ్యోతి): ఇటీవల విడుదలైన 10వ తరగతిలో పరీక్ష ఫలితాల్లో చిట్యాల మండలం గుండ్రాంపల్లి జడ్పీహెచ్ఎస్‌కు చెందిన విద్యార్థులు అత్యధిక మార్కులను సాధించారు. వారిని శనివారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో అభినందించారు. కంకల శిరీష 540, అన్నబోయిన సంజన 527, బందారపు అక్షిత 517, అబ్దుల్ ఖాజా, ఖదీర్ 513, బల్గూరి మోక్షిత 506 మార్కులను సాధించారు. వారిని గుండ్రాంపల్లి పీఏసీఎస్ వైస్‌చైర్మన్ ఆవుల నాగరాజుయాదవ్ విద్యార్థులను శాలువాలతో సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకట్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు వెంకట్‌రావు, అఫ్జల్‌షరీఫ్, రాంరెడ్డి, నర్సింహ, ప్రణయ, రేణుక తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి

***

ANDHRAJYOTHY



నల్లగొండ

1

ఆదివారం 4 మే 2025

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ : 18004251442

యాదాద్రి : 1800 425 7106

సూర్యాపేట : 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 60

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.170	260	290
సూర్యాపేట	రూ.160	240	270
నల్లగొండ	రూ.162	235	267

ఉష్ణోగ్రత గరిష్ఠం 40.5 । కనిష్ఠం 24.4



ఆటాపాటల

సమయం.. వేసవి

చిన్నారులకు శిక్షణ... భవితకు రక్షణ!!

పుస్తకాలతో కుస్తీ పట్టిన చిన్నారులకు వేసవి సెలవులంటే మహా సరదా. అధిక సమయం ఆటల్లో మునిగితేలుతుంటారు. ప్రస్తుతం సెల్ ఫోన్ ప్రపంచంగా మారడంతో పిల్లలు సైతం వాటికి బానిస అవుతున్నారు. శారీరక ఆటలు మరిచి సెల్‌ఫోన్ గేమ్స్‌కు బానిసవుతున్నారు. బాల్యానికి సెల్‌ఫోన్ ప్రమాదకారిగా మారుతున్న నేపథ్యంలో వేసవి సెలవుల్లో పిల్లల దృష్టిమరల్చాలని నిపుణులు చెబుతున్నారు. అందుకు వేసవి శిక్షణ శిబిరాలు దోహదపడనున్నాయి. జిల్లాలో ఇప్పటికే వేసవి శిబిరాలు ప్రారంభమయ్యాయి. నాట్యం, డ్రాయింగ్, ఆటలకు సంబంధించిన శిబిరాలు కొనసాగుతున్నాయి. పిల్లల అభిరుచి మేరకు వీటిలో శిక్షణ ఇప్పించాలని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

• 2లో.. - (ఆంధ్రజ్యోతి-యాదగిరిగుట్ట రూరల్)

సుస్థిర వ్యవసాయానికి రాష్ట్ర ప్రభుత్వం నూతన ప్రణాళికను రూపొందించింది. వానాకాలం సీజన్‌లో రైతులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించేందుకు 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ కార్యక్రమంలో భాగంగా ఈనెల 5 నుంచి జూన్ 13వ తేదీ వరకు శాస్త్రవేత్తలు రైతుల వద్దకే వెళ్లి పంటల సాగుపై అవగాహన కల్పిస్తారు. ఈ కార్యక్రమ నిర్వహణ బాధ్యతను ప్రభుత్వం ఆచార్య జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయానికి అప్పగించింది.

- (ఆంధ్రజ్యోతి,నల్లగొండ)



ఈ నెల 5 నుంచి

రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు

- జూన్ 13 వరకు అవగాహన కార్యక్రమాలు
- వానకాలం సీజన్‌పై రైతులకు సలహాలు, సూచనలు
- శాస్త్రవేత్తలతో పాటు వ్యవసాయశాఖ అధికారులకు బాధ్యతలు

'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమంలో భాగంగా శాస్త్రవేత్తలతో పాటు వ్యవసాయ అధికారులు, ఏఈవోలతో పాటు ఎంపీవోలు, జిల్లా వ్యవసాయ అధికారులు రైతుల వద్దకు వెళ్తారు. అందుకు సంబంధించి అధికార యంత్రాం గం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు రైతుల వద్దకు వెళ్లినప్పుడు సుస్థిర సాగు విధానాలు, పం టల పరిరక్షణ, తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించే పద్ధతులపై శాస్త్రీయ సూచనలు అందజేస్తారు. ప్రస్తుతం రైతులు ఎదుర్కొంటు న్న వాతావరణ పరిస్థితులు, నీటి కొరత, భూమిలో సారం తగ్గడం వంటి ప్రధాన సవాళ్లను రైతులు ఎదుర్కొనేలా శాస్త్రవేత్తలు ప్రత్యక్షంగా పరిష్కార మార్గాలు సూచిస్తారు.

రైతులను నష్టాల నుంచి గట్టెక్కించేలా

సుస్థిర వ్యవసాయ విధానాలపై అవగాహన పెంచడంతో పాటు రైతులను నష్టాల నుంచి గట్టెక్కించి లాభాదాయక వ్యవసాయం వైపు చైతన్యవంతం చేస్తారు. దీంతో పాటు వ్యవసాయ అనుబంధ రంగాలపై ప్రత్యేక దృష్టి సారించనున్నారు. ప్రధానంగా వరి, పత్తితో పా టు అనుబంధ వ్యవసాయమైన ఉద్యాన పంటలు అంటే బత్తాయి, నిమ్మ, మామిడి, తదితర పం టలతో పాటు కూరగాయల సాగుపై అవగాహన కల్పిస్తారు. రైతులకు నూతన సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పిస్తారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు నల్లగొండ జిల్లాలోని కంపాసాగర్‌లో ఉన్న కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలతో పాటు జిల్లా వ్యవసాయశాఖ అధికారులు సమగ్ర ప్రణాళికను రూపొందించి ముందుకు సాగుతున్నారు. 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమం ద్వారా ప్రతీ రైతుకు తక్షణ సహాయం అందించాలనేది ప్రభుత్వ ఉద్దేశం

- మిగతా 3వ పేజీలో...

జిల్లాలో ఇలా..

'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమంలో భాగంగా ఈనెల 5 నుంచి 13వ తేదీ వరకు గ్రామపంచాయతీ భవనాల వద్ద సమావేశాలను, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారు. నిడమనూరు మండలంలోని బంకాపురం, తుమ్మడం, నిడమనూరు, శాఖాపురం, వెనిగండ్ల, బొక్కమంతలపహాడ్, గుంటిపల్లి, వల్లభాపురం గ్రామాల్లో కేటాయించిన తేదీల్లో శాస్త్రవేత్తలు పర్యటించనున్నారు. త్రిపురారం మండలంలోని కంపసాగర్, బాబుసాయిపేట, పెద్దదేవులపల్లి, మాటూరు, రాగడప, బెంజికల్, అనుముల మండలంలోని నాయుడుపాలెం, ఇబ్రహీంపేట్, తిమ్మాపురం, చల్మారెడ్డిగూడెం, హజారిగూడెం, మాదారిగూడెం, పాలెంలలో శాస్త్రవేత్తలు పర్యటించనున్నారు. తిప్పర్తి మండలంలోని తిప్పలమ్మగూడెం, మిర్యాలగూడ మండలం వీరప్పగూడెం, తిరుమలగిరి మండలం నెల్లికల్ గ్రామాల్లో ముందుగా నిర్ణయించిన తేదీల ప్రకారం శాస్త్రవేత్తలు గ్రామాలకు వెళ్లి అవగాహన కల్పిస్తారు. తక్కువ యూరియా వాడకంతో పాటు సాగు ఖర్చును కూడా తగ్గించాలని, రైతులు అవసరం మేరకు మాత్రమే రసాయనాలను వినియోగించాలని, నేల తల్లిని కాపాడాలని శాస్త్రవేత్తలు వివరించనున్నారు. అదే విధంగా విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు కొనుగోలు చేశాక బిల్లులను భద్రపర్చుకొని నష్టపరిహారం పొందేలా, సాగునీటిని ఆదా చేసేలా పంట మార్పిడి చేసి సుస్థిర ఆదాయాన్ని పొందేలా, చెట్లను పెంచి పర్యావరణాన్ని కాపాడేలా శాస్త్రవేత్తలు రైతులకు అవగాహన కల్పించనున్నారు.

నేతన్నకు రుణమాఫీ



- రూ.లక్ష లోపు ఉన్నవారికి వర్తింపు
- ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- యాదాద్రిలో 1,159 మందికి లబ్ధి
- రూ.8.40కోట్ల మాఫీకి అవకాశం

భూదాన్‌పోచంపల్లి, మే 3 (ఆంధ్రజ్యోతి): చేనేత కార్మికులకు తీపి కబురు. నేతన్నలకు రుణమాఫీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు జీవో నెంబరు 56ను జారీ చేసింది. రూ.లక్ష లోపు రుణాలు తీసుకున్న వారికి మాత్రమే రుణమాఫీ వర్తించనుంది. గత ఏడాదిన సెప్టెంబరు 9న హైదరాబాద్‌లో (నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ - ఎన్ఐహెచ్‌టీ) జాతీయ చేనేత సాంకేతిక సంస్థ ప్రారంభోత్సవం సందర్భంగా రైతుల్లాగా చేనేత వృత్తిపై ఆధారపడిన నేత కార్మికులకు కూడా రుణమాఫీ చేసి ఆదుకుంటామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఉన్నతస్థాయి ఆదేశాల మేరకు రూ.లక్ష లోపు రుణాలు తీసుకున్న చేనేత కార్మికుల వివరాలను చేనేత, జౌళిశాఖ అధికారులు ప్రభుత్వానికి అందజేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా ఎన్నికల కోడ్ అమలులోకి రావడం, తదితర కారణాలతో రుణమాఫీ అమలులో కొంత జాప్యం జరిగింది. ఎట్టకేలకు రుణమాఫీకి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

రూ.33కోట్ల నిధులు మంజూరు

రాష్ట్ర వ్యాప్తంగా నేతన్నల రుణమాఫీ కోసం మొదటి దఫా రూ.33 కోట్ల నిధులు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 2017 ఏప్రిల్ 1నుంచి 2024 మార్చి 31వ తేదీ వరకు బ్యాంకుల్లో వ్యక్తిగత రుణాలు తీసుకున్న వారికి మాత్రమే ఈ రుణమాఫీ వర్తిస్తుంది. యాదాద్రి జిల్లాలో 1,162 మందికి రూ.8.4కోట్లు మాఫీ కానున్నాయి. అందులో ఒక్క భూదాన్‌పోచంపల్లి పట్టణంలో 234 మంది దాకా కార్మికులకు లబ్ధికలగనుంది.

జూన్ 1 వరకు అమలుకు కృషి



జిల్లాలో మొత్తం 1,162 మందికి రూ.8.40కోట్ల రుణాలు మాఫీ కానున్నాయి. ఇప్పటికే బ్యాంకుల ద్వారా రుణగ్రస్థుల వివరాలు సేకరించాం. జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి కమిటీ నిర్ధారించిన మేరకు జాబితాను రాష్ట్ర ఉన్నత అధికారులకు నివేదిస్తాం. త్వరలో రుణమాఫీ ప్రక్రియ జరుగుతుంది.

ఏ.శ్రీనివాస్‌రావు, జిల్లా చేనేత, జౌళిశాఖ అసిస్టెంట్ డైరెక్టర్

ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు



చేనేత కార్మికులకు రూ.లక్ష లోపు రుణమాఫీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినందుకు సంతోషంగా ఉంది. చేనేత కార్మికుల సమస్యలను గుర్తించిన రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. రైతుల మాదిరిగానే చేనేత కార్మికులకు తప్పని సరిగా రుణమాఫీ చేస్తామని చెప్పారు. ఇచ్చిన మాట ప్రకారం రుణమాఫీ చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు.

అంకం పాండు, పోచంపల్లి చేనేత కార్మిక సంఘం అధ్యక్షుడు

గిరిజన తండాల అభివృద్ధికి

జాతీయ పథకాల అమలు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి, పాల్గొన్న ఎమ్మెల్యే బాలునాయక్

- దేవరకొండ నియోజకవర్గంలో 29 గ్రామపంచాయతీల్లో కార్యక్రమాలు
- కలెక్టర్ ఇలా త్రిపాఠి

కొండమల్లేపల్లి, మే 3 (ఆంధ్రజ్యోతి): గిరిజన తండాల అభివృద్ధికి జాతీయ పథకాలు అమలు చేయనున్నట్టు కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. శనివారం దేవరకొండ ఎంపీడీవో కార్యాలయంలో ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్‌తో కలిసి జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. దేవరకొండ నియోజకవర్గంలో ధర్తి జన్ జాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియాన్ యోజన పథకం 29 గ్రామపంచాయతీలను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం 70శాతం, రాష్ట్ర ప్రభుత్వం 30 శాతం నిధులతో ఈ పథకాన్ని అమలు చేస్తున్నట్టు చెప్పారు. 50శాతం గిరిజన జనాభా ఉన్న గ్రామాలను ఎంపిక చేశామన్నారు. గ్రామాల్లో సివిల్ పనులపై ఎక్కువ దృష్టి కేంద్రీకరించామని, తాగునీరు, అంగన్‌వాడీ, పంచాయతీరాజ్, విద్య, వైద్యం, మత్స్య సంపద అభివృద్ధి పనులు చేపడతామన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ద్వారా తాగునీటి సంపులను ప్రతిపాదించాలని అన్నారు. రెడ్కో ద్వారా సోలార్ పవర్ ఏర్పాటు చేయాలన్నారు. ఐసీడీఎస్ ద్వారా అంగన్‌వాడీ భవనాలకు ప్రతిపాదనలు పంపాలని, అదే విధంగా దీర్ఘకాలిక పనులకు ఉపయోగపడేలా చూడాలని అన్నారు. పంచాయతీ భవనాలు లేని కొత్త పంచాయతీలలో వాటి నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాలని అన్నారు. అలసత్వం వహించకుండా అధికారులు కేంద్ర పథకాన్ని పకడ్బందీగా చేపట్టాలని ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే బాలునాయక్ మాట్లాడుతూ. ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టే పథకాలన్నింటికీ సాధ్యమైనంత ఎక్కువ లబ్ధిదారులు సద్వినియోగం చేసుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఏదైన కొత్త పథకం వచ్చినప్పుడు జాగ్రత్తగా అధ్యయనం చేసి సాధ్యమైనంత ఎక్కువ మంది వినియోగించుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పథకం మంజూరు, అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి

(ఆంధ్రజ్యోతి, కనగల్): అకాల వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. శనివారం కనగల్ పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె తనిఖీచేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. రైతులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు.

కుమ్మరిగూడెం గ్రామానికి చెందిన రైతు మాచర్ల సైదులు లారీల కొరత కారణంగా ధాన్యం కొనుగోలులో జాప్యం చేస్తున్నారని కలెక్టర్‌కు వివరించగా, లారీల కొరత లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆమె ఆదేశించారు. సీరియల్ ప్రకారం ధాన్యం కాంటాలు వేయాలన్నారు. రైతులను ఇబ్బందులకు గురిచేయకుండా కొనుగోళ్లు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో డీసీవో పార్థనాయక్, డీఎస్‌వో వెంకటేశ్వర్లు, పౌరసరఫరాలశాఖ డీఎం హరీష్, తహసీల్దార్ పద్మ, ఆర్ఐ యాదగిరి, పీఏసీఎస్ సిబ్బంది గిరి, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బ బారిన పడకుండా

జాగ్రత్తలు తీసుకోవాలి

కలెక్టర్ ఇలా త్రిపాఠి



నల్లగొండ టౌన్, మే 3 (ఆంధ్రజ్యోతి): వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని వడదెబ్బ బారిన పడకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి శనివారం ఒక ప్రకటనలో కోరారు. అధిక ఉష్ణోగ్రతల కారణంగా వడదెబ్బకు గురికాకుండా వైద్యారోగ్యశాఖతో పాటు, ఇతర శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఎండల తీవ్రత దృష్ట్యా మధ్యాహ్నా సమయంలో వీలైనంతవరకు ఇంట్లోనే ఉండాలని, తప్పని పరిస్థితుల్లో బయటికి వెళ్లాల్సి వస్తే టోపీ ధరించడం, తలకు తువ్వాలు చుట్టుకోవడం వంటి జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎక్కువ మోతాదులో తాగు నీరు, మజ్జిగ, పళ్ల రసాలు తీసుకోవాలన్నారు. సులభంగా జీర్ణమయ్యే ఆహారాన్ని భుజించాలని, తేలికపాటి కాటన్ వస్త్రాలను ధరించాలని సూచించారు. కార్యాలయాలు, వ్యాపార, వాణిజ్య సముదాయాల్లో పనిచేసే ఉద్యోగులు, కార్మికులు వడదెబ్బకు గురికాకుండా తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. ఉపాధి కూలీలు ఉదయం వేళల్లోనే పనులు చేసేలా చూడాలన్నారు. అన్ని ఆస్పత్రుల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు

ఇబ్బందులు లేకుండా చూడాలి



రికార్డులను పరిశీలిస్తున్న డీఆర్‌డీఏ పీడీ శేఖర్‌రెడ్డి

డీఆర్‌డీఏ పీడీ శేఖర్‌రెడ్డి

మునుగోడు రూరల్, మే 3 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు కలగకుండా కొనుగోళ్లు చేపట్టాలని డీఆర్‌డీఏ పీడీ శేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండలంలోని పలివెల, కిష్టాపురం, కొరటికల్ గ్రామాల్లో డీఆర్‌డీఏ సెర్ప్(ఐకేపీ) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన తనిఖీచేశారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులు నాణ్యమైన ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తీసుకొని రావాలని, తాలు ఉంటే తప్పకుండా తూర్పారపట్టిన తరువాతే ధాన్యం కొనుగోలు చేయాలన్నారు. కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించిన బిల్లులను వెంటనే సమర్పించాలన్నారు. ఆయన వెంట ఏపీఎం డి.మైసేశ్వరరావు, సీసీలు శ్రీనివాస్, శంకర్, మల్లేశ్వరీ, వీవోఏలు, కమిటీ సభ్యులు, తదితరులు ఉన్నారు.

రోహింగ్యాలకు అడ్డాగా తెలంగాణ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రఘునందన్‌రావు, వేదికపై పార్టీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి తదితరులు

మెదక్ బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు

రామగిరి, మే 3 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రోహింగ్యాలకు అడ్డాగా మారిందని భాగ్యనగర్, మెదక్ వంటి ప్రాంతాల్లోని మదర్సాల పేరుతో జరుగుతున్న ఘటనలపై ప్రభుత్వం ఎందుకు నిర్లక్ష్యం వహిస్తోందని మెదక్ పార్లమెంట్ సభ్యుడు ఎం.రఘునందన్‌రావు ప్రశ్నించారు. శనివారం నల్లగొండలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో ఎక్కడ, ఏం జరిగినా నల్లగొండలోనే మూలాలు కనిపిస్తున్నాయని, నల్లగొండ తీవ్రవాదులకు అడ్డాగా మారిపోయిందన్నారు. రాష్ట్రంలో ఉన్న విదేశీయులను గుర్తించి బయటికి పంపించాలని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారన్నారు. అయితే తెలంగాణ ముఖ్యమంత్రి సోయిలేకుండా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. మెదక్ మదర్సాల్లో జరిగిన ఘటన గురించి అధికార యంత్రాంగం పట్టించుకోదని, రాష్ట్రంలో ఏ మసీద్‌కు గానీ, ఏ చర్చికి గానీ మతిస్థిమితం లేని వ్యక్తులు వెళ్లరని, కేవలం హిందు దేవాలయాకు మాత్రమే వెళ్తున్నారని పోలీసులు చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి పాఠశాలలు, ఆసుపత్రులు తనిఖీలు చేయడం మంచిదేనని, వాటిలాగే మదర్సాలను కూడా సందర్శించి అక్కడ ఎవరుంటున్నారు, ఏం చెబుతున్నారు, ఏం జరుగుతుందో విచారించాలని డిమాండ్ చేశారు. జిల్లాలో ఎంతమంది ఐఎస్ఐ తీవ్రవాదులు ఉన్నారో ఎస్పీ ప్రకటించాలన్నారు. జిల్లాలో ఇద్దరు సీనియర్ మంత్రులు ఉన్నా, వీరు ఒక్కసారి కూడా ఐకేపీ కేంద్రాలకు వెళ్లి రైతులకు మద్దతు ధర దక్కుతుందా? లేదా? అని విచారించకపోవడం సిగ్గుచేటన్నారు. విలేకరుల సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, నాయకులు చింత సాంబమూర్తి, గోలి మధుసూదన్‌రెడ్డి, వీరెల్లి చంద్రశేఖర్, పిల్లి రామరాజుయాదవ్, పల్లెబోయిన శ్యాంసుందర్, కాలం విజేందర్‌రెడ్డి, గడ్డం మహేశ్, తదితరులు పాల్గొన్నారు.



సాగర్ జలాశయంలో ప్రస్తుత నీరు

డెడ్ స్టోరేజీకి 4అడుగుల దూరం

- సాగర్ ప్రస్తుత నీటిమట్టం 514 అడుగులు
- అందుబాటులో ఉన్న నీరు 7టీఎంసీలే

• 3లో..

నీట్‌కు అభ్యర్థులు సకాలంలో హాజరుకావాలి



నీట్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండ టౌన్, మే 3 (ఆంధ్రజ్యోతి): నీట్ (నేషనల్ ఎలిజిబులిటీ కమ్ ఎంట్రెన్స్ టెస్ట్)కు అభ్యర్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంతో పాటు ఎంజీ యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను ఎస్పీ శరత్‌చంద్ర పవర్‌తో కలిసి తనిఖీ చేశారు. జిల్లా కేంద్రంలోని రామగిరిలోని మహిళా డిగ్రీ కళాశాలలో, ఎంజీ యూనివర్సిటీలో ఏర్పాటుచేసిన పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసి సౌకర్యాలను, బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, నీట్ కోసం ఎంజీయూలో నాలుగు, ఎన్జీ కళాశాలలో ఒకటి, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఒకటి, కేంద్రీయ విద్యాలయంలో మరో పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. మొత్తం 2,087 మంది ఈ పరీక్షకు హాజరుకానున్నారని తెలిపారు. అభ్యర్థులు ఉదయం 11 గంటలకే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. మధ్యాహ్నం 1.30గంటల తర్వాత పరీక్షా కేంద్రం గేట్లు మూసివేస్తామన్నారు. పరీక్ష మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉంటుందని తెలిపారు. కలెక్టర్ వెంట ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ రాజ్‌కుమార్, అదనపు ఎస్పీ రమేష్, ఆర్డీవో వై.అశోక్‌రెడ్డి, డీఎస్పీ శివరాంరెడ్డి, నీట్ నోడల్ ఆఫీసర్, కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, తదితరులు ఉన్నారు.

నష్టపరిహారం అందించాలి

చింతపల్లి, మే 3(ఆంధ్రజ్యోతి):ఆకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులను గుర్తించి పరిహారం అందించాలని సీపీఐ మండల కార్యదర్శి పోలే వెంకటయ్య డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శనివారం ఆయన మాట్లాడారు. ఆరుగాలం కష్టించి రైతు పండిస్తున్న పంటలు గిట్టుబాటు ధర సక్రమంగా లేక వర్షాల కారణంగా దెబ్బతిన్న పంటలను గుర్తించి వెంటనే పరిహారం అందించేందుకు అధికారులు చర్య లు తీసుకోవాలని ఆయన కోరారు.

పారదర్శకంగా ఎంపిక చేయాలి

మాడ్గులపల్లి, మే 3(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను పార్టీలతో సంబంధం లేకుండా పారదర్శకంగా ఎంపిక చేయాలని బీజేపీ మండలాధ్యక్షుడు ఇటికాల జాన్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో శనివారం ఆయన మాట్లాడారు. ప్రభుత్వం గత పదేళ్లుగా ఇళ్లు నిర్మించకపోవడంతో పేదలు ఇబ్బందులు పడుతున్నారన్నారు ఆయన వెంట వెంకట్‌రెడ్డి, నరసింహా, నాగరాజు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఇంట్లో విలువైన వస్తువులు పెట్టుకోవద్దు

● దేవరకొండ సీఐ నర్సింహులు



ఇంటర్వ్యూ Interview

ఇంటికి తాళం వేసి ఊర్లలోకి వెళ్లే వారు ఇంట్లో విలువైన వస్తువులు, నగదును పెట్టుకోవద్దని, ఇంటి పక్కన వారికి సమాచారం ఇవ్వాలని దేవరకొండ సీఐ నర్సింహులు తెలిపారు. వేసవిలో దొంగతనాలు జరిగే అవకాశం ఉన్నందున వాటి నివారణకు తీసుకోవాల్సిన చర్యలును ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన తెలిపారు (ఆంధ్రజ్యోతి -దేవరకొండ)

ఆంధ్రజ్యోతి : దొంగతనాల నివారణకు ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?

సీఐ : వేసవి కావడంతో దొంగతనాలు జరగకుండా పెట్రోలింగ్ నిర్వహిస్తున్నాం. ఇంటికి తాళంవేసి ఊర్లకు వెళ్లే వారు విలువైన బంగారం, వస్తువులు, నగదును ఇంట్లో దాచుకోవద్దు. ఇంటి పక్కల వారికి పోలీసులకు సమాచారం ఇచ్చి వెళ్లాలి.

ఆంధ్రజ్యోతి : ఇటీవల దొంగతనాల కేసుల్లో ఎంత రికవరీ చేశారు?

సీఐ : రెండు నెలల వ్యవధిలో 23 తులాల బంగారాన్ని స్వాధీనం చేసుకొని దొంగలను రిమాండ్‌కు పంపించాం. అలాగే బర్రెల దొంగతనాలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగల ముఠాను కూడ పట్టుకొని అరెస్ట్ చేశాం.

ఆంధ్రజ్యోతి: సీసీ కెమెరాలు పనిచేస్తున్నాయా?

సీఐ: దేవరకొండ పట్టణంలో 42 సీసీ కెమెరాలకు మూడు సీసీ కెమెరాలు పనిచేయడంలేదు. వాటిని కూడ మరమ్మతు చేయిస్తున్నాం. దేవరకొండ పట్టణంలో త్వరలో మరో 50 వరకు దాతల సహకారంతో సీసీ కెమెరాలు ఏర్పాటుకు సన్నాహం చేస్తున్నాం. పట్టణంలో ఇంటి యజమానులు కూడ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి.

ఆంధ్రజ్యోతి: పట్టణంలో ట్రాఫిక్ అంతరాయం కలగకుండా ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

సీఐ: పట్టణంలోని ప్రధాన కూడలిలలో పోలీస్ తనిఖీలు చేపడుతున్నాం. వాహనాలను రోడ్లపై నిలిపితే జరిమానాలు విధిస్తున్నాం. ట్రాఫిక్ అంతరాయం కలుగకుండా చర్యలు చేపడుతున్నాం. పోలీస్‌శాఖ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు చేపడుతాం.

ఆంధ్రజ్యోతి: మైనర్లు వాహనాలు నడుపుతున్నారు, ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

సీఐ: మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులదే బాధ్యత. మైనర్లు వాహనాలు నడిపిస్తే గుర్తించి కౌన్సెలింగ్ ఇస్తాం. తల్లిదండ్రులను పిలిచి హెచ్చరికలు జారీ చేస్తున్నాం. మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులదే బాధ్యత.

శిథిలావస్థలో వంతెనలు

● సాగర్ ఎడమ కాల్వపై 50 ఏళ్ల క్రితం నిర్మాణం ● ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు ● కొత్త వంతెన నిర్మించాలని వేడుకోలు

త్రిపురారం, మే 3 (ఆంధ్రజ్యోతి)

మండలంలోని పెద్దదేవులపల్లి, ముకుందాపురం గ్రామాల్లో సాగర్ ఎడమ కాల్వపై ఉన్న వంతెనలు శిథిలావస్థకు చేరాయి. సాగర్ ప్రాజెక్టు నిర్మాణ సమయంలో 1955-65 మధ్యలో ఎడమకాల్వపై ఎడ్ల బండి పట్టే విధంగా ఫీట్ల వెడల్పులో వంతెనలు ఏర్పాటు చేశారు. ఇప్పటికే ఇవి నిర్మించి 55 ఏళ్లు దాటింది. ప్రస్తుతం వాహనాలు రాకపోకలు భారీగా పెరిగాయి. త్రిపురారంలోని జడ్చర్ల కోదాడ రహదారి నుంచి పెద్దదేవులపల్లి మీదుగా కుక్కడం వద్ద నార్కట్‌పల్లి-అద్దంకి జాతీయ రహదారికి వెళ్లాలంటే ఈ వంతెన దాటాల్సిందే.. ఈ రహదారిలోనే రెడ్డీస్, విశాఖ పరిశ్రమలు ఉన్నాయి. దాంతో నిత్యం ఈ రహదారి గుండా భారీ వాహనాలు వెళ్తుంటాయి. ఈ వం తెన చాలా సన్నగా ఉండటంతో ఎదురుగా వాహనా లు వస్తే మరో వాహనం నిలిచిపోవాల్సిన పరిస్థితి.. వంతెన చాలా పాతది కావడంతో వాహనాల తాకిడికి ఎపుడు కూలుతుందోనని వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు. వంతెనకు ఇరు వైపులా డ బుల్ రహదారి అభివృద్ధి చేసినా ఇప్పటి వరకు వంతెనను మాత్రం ఇప్పటి వరకు పట్టించుకునే వారే లేకుండా పోయారని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముకుందాపురం నుంచి తిప్పర్తి వెళ్లే రోడ్డు ఎడమ కాల్వపై ఉన్న వంతెన పూర్తి స్థాయిలో శిథిలావస్థకు చేరింది. ఈ రహదారిపై వాహనాల రాకపోకలు రోజుకు వందసంఖ్యలో సాగిస్తుంటాయి. ఇప్పటి వరకు కనీసం మరమ్మతులకు నోచుకోక పోవడం విచారకరం. ఎడమకాల్వపై ఉన్న వంతెనలు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.



ముకుందాపురంలో వంతెనపై నిలిచిన నీరు(ఫైల్)



పెచ్చులూడుతున్న రేలింగ్

శిథిలావస్థకు చేరిన వంతెనపై రోడ్డు భవనాల శాఖ డీఈ గణేశ్ కుమార్, ఏఈ దినేష్‌రెడ్డిలను ఫోన్ వివరణ కోరడానికి ప్రయత్నించగా ఫోన్‌లో లిఫ్ట్ చేయలేదు.

కొత్త వంతెనలు నిర్మించాలి



ఈ వంతెనలు నిర్మాణం చేపట్టి ఇప్పటికే 50ఏళ్లు దాటింది.. చాలా ఇరుకుగా ఉండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. వాహనాల రాకపోకలు చాలా కష్టంగా ఉంది. అధికారులు ఇప్పటి వరకు కొత్త వంతెనలు నిర్మాణం చేపట్టకపోవడం విచారకరం..

-చింతకుంట్లసూర్య, దుగ్గేపల్లి, త్రిపురారం మండలం

వణుకుపుడుతోంది



ఈ వంతెనపై ప్రయాణం అంటే వణుకుపుడుతోంది. ఎదురుగా వాహనం వచ్చిందంటే అన్ని వాహనాలు నిలిచి పోవాల్సిందే..వంతెన శిథిలావస్థకు చేరడంతో ఎప్పు కూలుతుందోనని భయాందోళనకు గురి అవుతున్నాం. కొత్త వంతెన నిర్మించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలి.

-బూర మధు, కోమటిగూడెం

మత్తు రహిత సమాజం కోసం కృషి చేయాలి

మిర్యాలగూడ అర్బన్, మే3(ఆంధ్రజ్యోతి): మత్తు రహిత సమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రభుత్వ ఉపాధ్యాయుడు రాచకొండ ప్రభాకర్ అన్నారు. మత్తు పదార్థాల వినియోగంతో జరిగే అనార్థాలపై సూర్యాపేట జిల్లా మద్దిరాల మండలం గోరంట్ల ఉన్నత పాఠశాలకు చెందిన తెలుగు ఉపాధ్యాయుడు ప్రభాకర్ తన బృందంతో పట్టణంలోని సుందరయ్య పార్కులో శనివారం అవగాహన కల్పించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్తుపదార్థాల వినియోగానికి వ్యతిరేకంగా తనవంతు పాత్రగా ఉమ్మడి జిల్లాలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జాతర ఉత్సవాలు, వారాంతపు సంత, జనసంచారం రద్దీగా ఉండే ప్రాంతాల్లో మత్తుపదార్థాల వ్యతిరేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మద్యపానం, దూమపానం, ఆరోగ్యానికి హానికరమైన డ్రగ్స్ నియంత్రణ కోసం ప్రత్యేకంగా రూపొందించిన కరపత్రాలను ఆయన పంపిణీచేశారు. చేతిలో మైక్‌పట్టుకొని విచిత్రవేషధారణలో మత్తువద్దు- ప్రాణమే ముద్దు అనే నినాదంతో ప్రభుత్వ ఉపాధ్యాయుడు ప్రభాకర్ చేపడుతున్న వినూత్న ప్రచార కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి ఆదరణ లభిస్తోంది.



కరపత్రాలను పంపిణీ ప్రభాకర్

బీఆర్‌ఎస్ నేతలు ప్రజలను వంచించడం మానుకోవాలి

● బిల్లుల కోసమే మినీ రవీంద్రభారతికి కేసీఆర్ పేరు ● కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు నూకల వేణుగోపాల్‌రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నూకల వేణుగోపాల్‌రెడ్డి

మిర్యాలగూడ, మే 3(ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ నాయకులు ప్రజల్ని వంచించడం మానుకోవాలని కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు నూకల వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. కళాభారతికి కేసీఆర్ తొలగించడంపై బీఆర్‌ఎస్ ఆందోళనపై శనివారం మునిసిపల్ మాజీ కౌన్సిలర్లు, పార్టీ వార్డు ఇన్‌చార్జిలతో కలిసి కళాభారతి వద్ద నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశ, రాష్ట్ర అభివృద్ధికి మార్గదర్శకంగా నిలిచి ప్రజల మన్ననలు పొందిన నేత లు మరణిస్తే భవిష్యత్ తరాలు వారి సేవలను గుర్తు చేసుకునేందుకు వారి పేర్లు కొత్త ప్రాజెక్టుల పెట్టడం పరిపాటిగా వస్తుందన్నారు. తాము చేయని పనికి నిధులు రాబట్టుకునేందుకు కేసీఆర్ బతికుండగానే ఆయన పేరు వాడుకున్నారని విమర్శించారు. బీఆర్‌ఎస్ నేత మా ట్రాప్ లో పడ్డాడని ఆయన చెప్పినట్లుగా కళాభారతిలో సెంట్రల్ ఏసీ ఏర్పాటు చేయకుండానే చేసినట్లు చెప్పారని ఎన్నికల ముందు చేయని పనులకు బిల్లులు ఎత్తేందుకే ఎక్కడా కనీస తీర్మాణం లేకుండా పేరు ఖరారు చేశారని అన్నారు. మిర్యాలగూడ పట్టణ అభివృద్ధిలో భాగంగా 2006లోనే అప్పటి కాంగ్రెస్ కేంద్ర మంత్రి సూదిని జైపాల్‌రెడ్డి రూ.2 కోట్ల అంచనాతో మినీ రవీంద్ర భారతి పేరున రూ.50 లక్షలు మంజూరు చేశారని అన్నారు. తిరిగి కాంగ్రెస్ ఎంపీ గుత్తా సుఖేందర్‌రెడ్డి సొంత నిధులు 1.30కోట్లు వెచ్చించారని అన్నారు. ఎస్‌డీఎఫ్ నుం చి రూ.2 కోట్లు, టీఎఫ్ఐడీసీ నుంచి రూ.4 కోట్లు అప్పు తీసుకుని నిర్మాణం చేసిన దానికి కేసీఆర్ పేరు ఎలా పెడతారని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో నియోజకవర్గంలో జరిగిన అవినీతి అక్రమాలపై జ్యుడిషియల్ విచారణ చేయాలని కోరనున్నట్లు చెప్పారు.

జయశంకర్ సార్ పేరు ఎందుకు పెట్టలేదు

కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి చిలుకూరి బాలు మాట్లాడుతూ మీకు నిజంగా తెలంగాణపై ప్రేమవుంటే తెలంగాణ జాతిపిత జయశంకర్‌సార్ పేరుగాని, కాళోజి, గద్దర్, శ్రీకాంతాచారి లాంటి వారిపేర్లు ఎందుకు పెట్టలేదన్నారు. మీరు గుంటూరు జిల్లా నాదెండ్ల నుంచి వచ్చినవారు కారా అని ప్రశ్నించారు. సర్పంచ్‌గా గెలవని వారిని జానారెడ్డి ఎమ్మెల్యేను చేస్తే కాంగ్రెస్ కార్యకర్తలను మోసం చేసి గెలిచిన 6 కాంగ్రెస్‌ను వదిలి 6 నెలలకే బీఆర్‌ఎస్‌లో చేరిన సంగతి గుర్తుంచుకోవాలన్నారు. సమీకృత మార్కెట్‌కు రూ. 4.5 కోట్లు ఖర్చుఅవుతుండగా రూ.2 కోట్లు మంజూరు చేసి భవనం పూర్తి చేయలేదని ఆరోపించడం తగునా అన్నారు. పదేపదే అబద్ధాలు ప్రచారం చేస్తే ప్రజలు సహించే పరిస్థితిలో లేరన్న విషయాన్ని గ్రహించి మొలగాలని హితవు పలికారు. ఎంపీటీసీల సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు బెజ్జం సాయి మాట్లాడుతూ గతంలో బీఆర్ ఎస్ రోడ్లపై తిరగొద్దని చెప్పాడు కులాల పేరుతో ప్రజల్ని దూషించారు. ఇప్పుడు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఖాళీ చేయాలంటున్నాడు. సమావేశంలో కాంగ్రెస్ కిసాన్ జిల్లా అధ్యక్షుడు ముదిరెడ్డి నర్సిరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పొదిల శ్రీనివాస్, దేశిడి శేఖర్‌రెడ్డి, గంధం రామకృష్ణ, కొమ్ము శ్రీనివాస్, కొమ్మన నాగలక్ష్మి, పందిరి అనిత, జానకీరాంరెడ్డి, ఉబ్బపెల్లి కాశయ్య, హడావత్ అశోక్ నాయక్, నాగు నాయక్, గుంజ శ్రీను, రమేష్ నాయక్, జానీ, సలీం, ఆరీఫ్ పాల్గొన్నారు.

ఎల్లాపురంలో తాగునీటి కోసం తండ్లాట

ఐదు రోజులుగా మరమ్మతుకు నోచని ట్రాన్స్‌ఫార్మర్

(ఆంధ్రజ్యోతి -తిరుమలగిరి(సాగర్)

మండలంలోని ఎల్లాపురం గ్రామస్థులు తాగునీటి కోసం అల్లాడుతున్నారు. ఐదు రోజుల క్రితం నుంచి గ్రామంలోని ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతుకు గురికావడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో త్రిఫేజ్ విద్యుత్ సరఫరా ఉంటేనే గ్రామ పంచాయతీకి సంబంధించిన బోరు పనిచేస్తోంది.ఈ క్రమంలో ఇళ్లలో అవసరాలకు నీటి సరఫరా సక్రమంగా కావడంలేదు. సుమారు 240 ఇళ్లు ఉన్న ఈ గ్రామంలో వేసవిలో నీటి సరఫరా నిలిచిపోయినప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

భగీరథ నీరు అంతంత మాత్రమే సరఫరా

గ్రామంలో మిషన్ భగీరథ పథకం ద్వారా తాగునీటిని సరఫరా చేసేందుకు 60వేల లీటర్ల సామర్థ్య గల ఓహెచ్‌ఎస్‌ఆర్ ట్యాంక్ ఉంది. అయితే గ్రిడ్ నుంచి ట్యాంక్ నింపడానికి సరిపడేంత నీరు సప్లయ్ కావడం లేదని గ్రామస్థులు పేర్కొంటున్నారు. ఈ పథకం ప్రారంభమైన నాటి నుంచి నేటి వరకు ట్యాంక్‌కు అరకొరగానే తాగునీటిని సరఫరా చేస్తున్నారని దీంతో సావర్థ్యం మేరకు మిషన్ భగీరథ ట్యాంక్ నిండిన దాఖలాలే లేవని స్థానికులు తెలిపారు.

భగీరథ,బోరు నీళ్లు కలిపి సరఫరా

మిషన్ భగీరథ ట్యాంక్‌కు తాగునీరు పూర్తి సామర్థ్యం మేరా సరఫరా అయ్యే పరిస్థితి లేదు. అదే గ్రామంలో ఉన్న పంచాయతీ బోర్ ద్వారా వచ్చే నీటితో కూడా భగీరథ ట్యాంక్‌ను నింపుతున్నారు. తద్వారా గ్రామంలోని 240 ఇళ్లకు భగీరథ పైపులైన్లు, నీటి కుళాయిల ద్వారా భగీరథ, శుద్ధి చేయని బోరు నీళ్లను కలిపి సుమార ఆరేండ్లుగా గ్రామస్థులకు సరఫరా చేస్తుండడం క్షేత్రస్థాయిలో మిషన్ భగీరథ పథ కం అమలవుతున్న తీరును తేటతెల్లం చేస్తు ంది.

ఒకే ఒక నల్లా

గ్రామంలో ఉన్న మిషన్‌భగీరథ ట్యాంక్‌కు సుర క్షిత జలాలు సరిపడా సప్లయ్ కాకపోవడం ఈ గ్రామవాసుల పాలిట శాపంగా మారింది. దీనివల్ల భగీరథ నీటికి బోర్ నీటిని కలిపి సప్ల య్ చేస్తుండడంతో ఆ నీటిని గ్రామస్థులు ఇంట్లో అవసరాలకు ఉపయోగిస్తున్నారు. ఈ క్రమంలో తాగునీటి కోసం గ్రామంలోనే పల్లె ప్రకృతి వనానికి సమీపంలో కాంసాని అంజయ్య ఇంటి వద్ద ఉన్న నీటి కుళాయినే గ్రామస్థులందరూ వినియోస్తున్న పరిస్థితి నెలకొంది.

ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతు పట్టించుకునే వారేరి

ఐదు రోజుల క్రితం త్రిఫేజ్ విద్యుత్ సరఫరాకు సంబంధించిన ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులకు గురైంది. అయినప్పటికీ సంబంధిత విద్యుత్ శాఖ అధికారులు పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేస్తున్నారు. అయితే ఈ సమస్యలన్నింటిని పట్టించుకోవాల్సిన పంచాయతీ కార్యదర్శి అడపాదడపాగా మాత్రమే తమ గ్రామానికి విధుల నిర్వహణ నిమిత్తం వస్తున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు.



గ్రామంలో కుళాయి వద్ద నీటిని పట్టుకునేందుకు వచ్చిన మహిళలు

నీటి సమస్యను తీర్చాలి



మిషన్ భగీరథ నీళ్లు సక్రమంగా రావట్లేదు. ఐదు రోజుల నుంచి బోరు నీళ్లు కూడా రావట్లేదు. ఎండాకాలం కావడంతో ఇంట్లో స్నానాలకు కూడా ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు పట్టించుకోవాలి.

- లింగాల హుసేనమ్మ (ఎల్లాపురం)

సమస్యను పరిష్కరిస్తాం

ఎల్లాపురం గ్రామంలోని గ్రామస్థులకు మిషన్ భగీరథ నీళ్ల పంపిణీ విషయంలో తలెత్తిన సమస్యను పరిశీలించి పరి ష్కరి స్తాం. ట్యాంకులకు సరైన రీతిలో నీటి సప్లయ్ అంశంలో గ్రిడ్ అధికారులకు కూడా బాధ్యత ఉంటుంది.

- మధు (మిషన్ భగీరథ డీఈఈ)

నేడు వివిధ శాఖల అధికారులతో మంత్రి సమీక్ష

మిర్యాలగూడ, మే 3 (ఆంధ్రజ్యోతి): ఇరిగేషన్, సివిల్‌సప్లయ్ శాఖ అధికారులతో ఆదివారం ఇరిగేషన్, పౌరసరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు. స్థానిక ఎస్‌పీ కన్వెన్షన్‌హా ల్‌లో ఉమ్మడి నల్లగొండ జిల్లా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, అధి కారులతో మధ్యాహ్నం 1:30 నుంచి 4:30 గంటల వరకు సమీక్షా చేయనున్నారు ఇరిగేషన్ పనులు, పౌరసరఫరాల శాఖలో ధాన్యం సేకరణ తదితర అంశాలపై సమావేశంలో చర్చించనున్నట్లు అధికారులు పేర్కొన్నారు.


ధాన్యం కొనుగోలును వేగవంతం చేయాలి : సీపీఎం



పెద్దవూరలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న చినపాక లక్ష్మీనారాయణ

పెద్దవూర, మే 3(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు చినపాక లక్ష్మీనారాయణ అన్నారు. మండల కేంద్రంలోని మార్కెట్‌యార్డులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం ఆయన సీపీఎం నాయకులతో కలిసి పరిశీలించి మాట్లాడారు. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించింది కాని గన్నీ బ్యాగ్‌ల కొరత, లారీలు సకాలంలో రాకపోవడంతో రైతాంగం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. క్వింటాకు రెండు కిలోల తరుగు తీస్తున్నారని, తూకాల్లో కూడా తేడాలు ఉంటున్నాయని, ఇలాంటి మోసాలను అరికట్టాలని కోరారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు కనీస సౌకర్యాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి దుబ్బ రామచంద్రయ్య, దోరెపల్లి మల్లయ్య, తరి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దేవరకొండ తహసీల్దార్‌గా మధుసూదన్ రెడ్డి బాధ్యతలు



బాధ్యతలు స్వీకరిస్తున్న మధుసూదన్ రెడ్డి

దేవరకొండ, మే 3, (ఆంధ్రజ్యోతి): దేవరకొండ తహసీల్దార్ గా మధుసూదన్‌రెడ్డి శనివారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న సంతోష్ కిరణ్ బదిలీ అయ్యారు. కేతేపల్లి మండలంలో తాహసీల్దార్‌గా పని చేస్తున్న మధుసూదన్ రెడ్డిని దేవరకొండ తాహసీల్దార్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో ఆయన బాధ్యతలు స్వీకరించారు.దేవరకొండ మం డలంలో భూ సమస్యలని భూ భారతి ద్వారా పరిష్కారం అయ్యేలా కృషి చేస్తానన్నారు.

కార్మికులకు అండగా ఐఎన్‌టీయూసీ జెండా

మిర్యాలగూడ, మే 3 (ఆంధ్రజ్యోతి): కార్మికుల సమస్యలను పరిష్కరించే దిశలో అండగా ఉండేది ఐఎన్‌టీయూసీ జెండానేనని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు అంబటి సోమయ్య అన్నారు. ఐఎన్‌టీయూసీ 78వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా స్థానిక కాంగ్రెస్ కార్యాలయంలో కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రేడ్ యూనియన్ లలో ఐఎన్‌టీయూసీకి ప్రత్యేకమైన స్థానం ఉందన్నారు.యూనియన్ ఆధ్వర్యంలో కార్మికుల సమస్యల పరిష్కారం కోసం పోరాడి ప్రజా నాయకులు ఎదిగినవారు ఎందరో ఉన్నారని ఉన్నతమైన పదవుల్లో రాణించి ప్రజల మన్నలను పొందారని అన్నారు. ఐఎన్‌టీయూసీకి జాతీయ అధ్యక్షుడిగా పనిచేసిన గుల్జార్ లాల్ నంద ఈ దేశ ప్రధాని పదవిని చేపట్టి పదవికి వన్నె తెచ్చారన్నారు. అసంఘటిత రంగ కార్మికుల సమస్యలను సైతం ప్రభుత్వాల దృష్టికి తీసుకవెళ్లి పరిష్కారమయ్యేలా చేయడం జరిగిందన్నారు. కార్మికుల పని భద్రత, వేతనాల పెంపు, ఆరోగ్య బీమా కల్పనకు ఐఎన్‌టీయూసీ పోరాడిందన్నారు. కార్మికులు ఐఎన్‌టీయూసీ జెండా నీడలో సంఘటితమై తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చుకోవాలని అన్నారు. కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు చిరుమర్రి కృష్ణయ్య, పెరిక వెంకటేశ్వర్లు, మెరుగు శ్రీనివాస్, పైడిమర్రి నర్సింహరావు, టి.రాములు, కిరణ్ పాల్గొన్నారు.

గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి

నిడమనూరు, మే 3 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తుందని నిడమనూరు మార్కెట్ కమిటీ చైర్మన్ అంకతి సత్యం, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి యడవల్లి వల్లభ్‌రెడ్డి అన్నారు. మండలంలోని వెనిగండ్ల గ్రామంలో రూ.5 లక్షల ఎస్‌డీఎఫ్ నిధులతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు శనివారం శంకుస్థాపన చేసి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలు అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో పీఆర్ ఏఈ సాయిప్రసాద్. నాయకులు నందికొండ మట్టారెడ్డి, కొండా శ్రీనివాస్‌రెడ్డి, ముంగి శివమారయ్య, కొప్పోలు స్వర్ణలత, పోలే రవి, గాదె సుధాకర్, చల్లా తిరుమల్, మారయ్య, విక్రమ్, రవి, భిక్షం, సుధీర్, పురుషోత్తమ్, రాజు, సైదులు. సాంబయ్య, నరేందర్ పాల్గొన్నారు.



సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

గుర్రంపోడు, మే 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కాల్వపల్లి గ్రామంలో విద్యుదాఘాతంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఎస్‌ఐ పసుపులేటి మధు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన పంగ యాదయ్య ఇంటి సర్వీస్ వైర్ గత రాత్రి గాలి వానకు తెగి పడింది. దీంతో గ్రామంలో కరెంటు పనులు చేసే కొండమీది అశోక్ (40)ను తీసుకొని వెళ్లి వైరును మరమ్మతు చేస్తుండగా షాక్‌గురై పడిపోయాడు. హుటాహుటినా దేవరకొండ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే చనిపోయాడు. మృతుడి భార్య హేమలత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడికి కుమార్తె, కుమారుడు ఉన్నారు.

చలివేంద్రం ప్రారంభం

దేవరకొండ, మే3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండభీమనపల్లి జాతీయ రహదారి 167పై ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో జాతీయ రహదారిపై శనివారం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. జాతీయ రహదారిపై చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి మట్టి కుండలో తాగు నీరు కల్పించిన గ్రామపంచాయితీ అధికారులకు అభినందనలు తెలిపారు.

యువతకు ఉపాధి కల్పించడంలో విఫలం

దేవరకొండ, మే 3 (ఆంధ్రజ్యోతి) : యువతకు ఉపాది అవకాశాలు కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమవుతున్నాయనిఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి యేశమోగి మల్లేష్ అన్నారు. దేవరకొండలో ఏఐవైఎఫ్ ఆవి ర్భావ దినోత్సవం సందర్భంగా శనివారం జెండా ఎగురవేసి మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమగ్ర యువజన విభాగం కోసం విద్య, వైద్య వ్యాపారాన్ని రద్దు చేసి ప్రతి పౌరుడికి ఉపాది అవకాశాలు కల్పించాల న్నారు.



జెండాను ఎగురవేస్తున్న జిల్లా సహాయ కార్యదర్శి మల్లేష్